విశాలాంధ్ర

తిరుపతి జిల్లా

చిత్తూరు జిల్లా

ఆదివారం 26 జనవరి 2025 | 8 పేజీలు

సెంచరీ ప్రయోగానికి...

ఇస్రో సర్వం సిద్ధం

29వ తేది ఉదయం 6 గంటల 23 నిమిషాలకు జీఎస్ఎల్వీ- ఎఫ్ 15 రాకెట్ ప్రయోగం

నూతన ఇస్రో ఛైర్మన్ ఆధ్వర్యంలో సెంచరీ ప్రయోగం

విశాలాంధ్ర - సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ షార్ నుండి ఈనెల 29వ తేదీ ఉదయం 6 గంటల 23 నిమిషాలకు జిఎస్ఎల్వి-ఎఫ్ 15ను శ్రీహరికోటలోని రెండవ ప్రయోగ వేదిక నుండి నింగిలోకి పంపి సెంచరీ సాధించేందుకు ఇస్రో సర్వం సిద్ధం చేసింది. ఎఫ్-15 అనేది భారతదేశం యొక్క జియోసింక్రోనస్ శాటిలైట్ లాంచ్ వెహికల్ జిఎస్ఎల్వి యొక్క 17వ రాకెట్ మరియు స్వదేశీ క్రయో స్టేజ్‌తో 11వ రాకెట్. ఇది స్వదేశీ క్రయోజెనిక్ స్టేజ్‌తో జిఎస్ఎల్వి యొక్క 8వ ఆపరేషనల్ ఫ్లైట్ మరియు భారతదేశం యొక్క శ్రీహరికోటా పోర్ట్ నుండి 100వ లాంచ్. జిఎస్ఎల్వి-ఎఫ్ 15 పేలోడ్ ఫెయిరింగ్ ఎ 3.4 మీటర్ల వ్యాసం కలిగిన లోహ వెర్షన్. స్వదేశీ క్రయోజెనిక్ దశతో కూడిన జిఎస్ఎల్వి-ఎఫ్ 15 ఎన్విఎస్-02 ఉపగ్రహాన్ని జియోసింక్రోనస్ ట్రాన్స్‌ఫర్ ఆర్బిట్‌లో ఉంచు తుంది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్‌లోని రెండవ లాంచ్ ప్యాడ్ (ఎస్ఎల్‌పి) నుండి ప్రయోగం జరుగుతుంది. నావిగేషన్ విత్ ఇండియన్ కాన్స్టెలేషన్ (ఎన్ఎవిఐసి) అనేది భారతదేశం యొక్క స్వతంత్ర ప్రాంతీయ

2

ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా

అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్

- వివరాలు 2వ పేజీలో

కుటుంబాన్ని గుర్తుపెట్టుకుని...

ఏకాగ్రతతో వాహనాన్ని నడపండి

- సురక్షితంగా గమ్యాన్ని చేరండి
- చిత్తూరు ఎంపీ దగ్గు మళ్ళ ప్రసాద్ రావు

విశాలాంధ్ర - చిత్తూరు: కుటుంబాన్ని గుర్తుపెట్టుకోని, ఏకాగ్రతతో వాహనాన్ని నడపితే, సురక్షితంగా గమ్యాన్ని చేరుకోవచ్చు నని.వాహన చోదకులకు ద చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు సూచించారు. శనివారం చిత్తూరులోని క్యామ్ ఫోర్డ్ స్కూల్లో జరిగిన 36వ జాతీయ రహదారి భద్రతా మాసోత్స వాలకు ఎంపీ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. అంతకుముందు పాఠశాలకు చేరుకున్న చిత్తూరు పార్లమెంటు సభ్యులు దగ్గుమళ్ళ ప్రసాదరావు, డిటిసి నిరంజన్ రెడ్డి, యం.వి.ఐ అధికారులు రాజేశ్వరరావు, నర్సింహులు, ట్రాఫిక్ సిఐ నిత్యా బాబు లకు.ఆ పాఠశాల కరస్పాండెంట్ , అధ్యాపకులు, విద్యార్థులు సాదర స్వాగతం పలికారు. అనంతరం జ్యోతి ప్రజ్వలనతో జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాల అవగాహన సదస్సును ప్రారం భించారు.అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ తప్పిదాల వల్లే రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాని, అయితే ఏకాగ్రతగా వాహనాలను నడిపితే, సురక్షితంగా తమ గమ్యాలను చేరుకోవచ్చునన్న విషయాన్ని ప్రతి వాహన చోదకుడు గ్రహించాలని తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రభుత్వం కూడా పటిష్ట చర్యలను చేపడుతుందన్నారు. ఇందులో భాగంగానే జాతీయ రహదారి భద్రతా మాసోత్సవాలకు

2

ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారం అందుకున్న జిల్లా ఎస్పీ

విశాలాంధ్ర- చిత్తూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 2024వ సంవత్సరంలో జరిగిన ఎన్నికల సందర్భముగా చిత్తూరు జిల్లా నందు ఎన్నికలను జిల్లా ఎస్పీ మణికంఠ చందోలు పారదర్శక తతో ఎన్నికలను నిర్వహించి, శాంతిభద్రతల సమస్యలు తలెత్తకుండా ప్రశాంత వాతావరణంలో ఎన్నికల ప్రక్రియను నిర్వహించినం దుకు గాను ఎస్పీకి ఉత్తమ ఎన్నికల నిర్వహణ పురస్కారం దక్కింది. శనివారం విజయవాడ నందు జరిగిన 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమంలో

2

టీటీడీ పరిపాలన భవనంలో గణతంత్ర వేడుకలకు ఏర్పాట్లు పూర్తి

విశాలాంధ్ర -తిరుపతి: తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో జనవరి 26వ తేదీ ఆదివారం నిర్వహించనున్న గణతంత్ర వేడుకలకు అన్ని ఏర్పాట్లు పూర్తయ్యాయి.పరిపాలన భవనం వెనక వైపున గల పరేడ్ మైదానంలో టీటీడీ కార్యనిర్వహణాధికారి శ్రీ జె.శ్యామలరావు ఉదయం 8.30 గంటలకు జాతీయ జెండాను ఎగురవేస్తారు. అనంతరం ఉద్యోగులను ఉద్దేశించి ప్రసంగిస్తారు. విధినిర్వహణలో ప్రతిభ కనబరిచిన ఉద్యోగులకు ఉత్తమ అవార్డులను అందజేయనున్నారు. ఈ సందర్భంగా టీటీడీ విద్యాసంస్థల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలను ప్రదర్శిస్తారు.

ఇస్రో సర్వం సిద్ధం

(మొదటి పేజీ తరువాయి) నావిగేషన్ శాటిలైట్ సిస్టమ్. ఇది భారతదేశంలోని వినియోగదారులకు అలాగే భారత భూభాగానికి మించి 1500 కి.మీ విస్తరించి ఉన్న ప్రాంతానికి ఖచ్చితమైన స్థానం. వేగం మరియు సమయ సేవలను అందించడానికి రూపొందించబడింది. ఎన్ఎవిఐసి రెండు రకాల సేవలను అందిస్తుంది. అవి స్టాండర్డ్ పొజిషనింగ్ సర్వీస్ (ఎస్‌పిఎస్) మరియు రిస్ట్రిక్టెడ్ సర్వీస్ (ఆర్ఎస్) ఎన్ఎవిఐసి యొక్క ఎస్‌పిఎస్ 20ఎం (2ఎస్) కంటే మెరుగైన స్థాన ఖచ్చితత్వాన్ని మరియు సేవా ప్రాంతంలో 40ఎన్ఎస్ (2ఎస్) కంటే మెరుగైన సమయ ఖచ్చితత్వాన్ని అందిస్తుంది. ఈ ప్రయోగం నూతనంగా ఇస్రో చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన వి.నారాయణన్ ఆధ్వర్యంలో ఇది మొదటి ప్రయోగం ఈ ప్రయోగం విజయవంతం కావాలని మనము ఆశిద్దాం.

ఏకాగ్రతతో వాహనాన్ని నడపండి

(మొదటి పేజీ తరువాయి) శ్రీకారం చుట్టుందని చెప్పారు. మరీ ముఖ్యంగా వాహనాలకు ఆటోమేటిక్ డోర్లను ఏర్పాటు చేయడం ద్వారా కూడా యాక్సిడెంట్ తగ్గించేందుకు వీలవుతుందని చెప్పారు. ఈ ఉత్సవాలు ప్రారంభమై నేటికీ 36 సంవత్సరాలు పూర్తి చేసుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమాలను పాటించి విలువైన ప్రాణాలను కాపాడుకోవాలనీ తెలిపారు. డిటిసి నిరంజన్ రెడ్డి, యం.వి.ఐ అధికారులు రాజేశ్వరరావు, నర్సింహులు, ట్రాఫిక్ సిఐ నిత్యా బాబు మాట్లాడుతూవాహనాల కండీషన్ను వాహన చోదకులు ఎప్పటికప్పుడు పరీక్షిస్తూ ఉండాలని. తద్వారా రోడ్డు ప్రమాదాల నివారణకు చెక్ పెట్టగలమన్నారు.కాగా జిల్లా వ్యాప్తంగా ఉన్న ప్రవేట్ పాఠశాలల వాహనాలన్నీ చాలావరకు కండిషన్ లోనే ఉన్నాయని,అయితే లైసెన్సు లేని డ్రైవర్ చేతికి స్కూల్ వాహనాన్ని ఇవ్వద్దంటూ.ప్రైవేటు పాఠశాలల యాజమాన్యానికి సూచించారు. రోడ్డు భద్రతకు సంబంధించి సలహాలు సూచనలు ఇచ్చేందుకు ఆర్టిఏ అధికారులు ఎప్పుడు సిద్ధంగా ఉంటారని వారు తెలియజేశారు.

అవార్డును అందుకున్న జిల్లా కలెక్టర్

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా అవార్డును అందుకున్నారు. ఈ మేరకు శనివారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో జరిగిన జాతీయ ఓటర్ల దినోత్సవం 2025 కార్యక్రమంలో బెస్ట్ ఎలక్టోరల్ ప్రాక్టీసెస్ పురస్కారాలు-2024 కు సంబంధించి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ చేతుల మీదుగా ఉత్తమ జిల్లా ఎన్నికల అధికారిగా అవార్డును కలెక్టర్ వెంకటేశ్వర్ అందుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ ను పలువురు అభినందించారు. తిరుపతి జిల్లా కలెక్టర్ గా పదవీ బాధ్యతలు చేపట్టినప్పటినుండి డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్ పరిపాలనలో తనదైన శైలిలో వ్యవహరించి ప్రజలు మన్ననలు పొందుతు న్నారు. జిల్లా ఎస్.పి వి. హర్షవర్ధన్ రాజు కూడా ఉత్తమ ఎస్పీ గా బెస్ట్ ఎలక్ట్రోరల్ ప్రాక్టీసెస్ అవార్డులు 2024 కింద ఎంపిక అయ్యారు.అలాగే 122-వెంకటగిరి అసెంబ్లీ నియోజక వర్గ ఈ.ఆర్.ఓ బి.సుధారాణి ఉత్తమ ఈఆర్ఓ గా, తిరుపతి అర్బన్ తహసిల్దార్ భాగ్యలక్ష్మి 167- తిరుపతి నియోజవర్గం వారు ఉత్తమ ఏ.ఈ.ఆర్.ఓ గా, తిరుపతి నుండి బిఎల్వో ఆర్. జ్యోతి, సత్యవేడు నుంచి ఎస్. పార్వతి ఉత్తమ బిఎల్వో లుగా, తిరుపతి కలెక్టరేట్ నుండి బెస్ట్ డేటా ఎంట్రీ డిఈఓ గా పవన్ కుమార్ పురస్కారాలను అందుకున్నారు.

పురస్కారం అందుకున్న జిల్లా ఎస్పీ

(మొదటి పేజీ తరువాయి) డైరెక్టర్ ఆఫ్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ నిమ్మగడ్డ రమేష్ కుమార్ సమక్షంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సి.ఎస్. .విజయానంద్ చేతుల మీదుగా ఈ పురస్కారం అందుకున్నారు. 2024 ఎన్నికలు పారదర్శకత శాంతిభద్రతలతో ప్రశాంత వాతావరణంలో విజయవం తంగా ముగిసినందుకు, చిత్తూరు జిల్లా అధికారులు సిబ్బంది ప్రతి ఒక్కరూ ఎన్నికల ప్రక్రియ ప్రారంభం నుంచి కౌంటింగ్ ప్రక్రియ ముగిసే వరకు సమర్ధవంతంగా కేటాయించిన విధులను నిర్వహించారు. జిల్లా లో ఎలాంటి అవాంచనీయ ఘటనలు చోటు చేసుకోకుండా విధులు నిర్వహించిన ప్రతి ఒక్కరికి ఎస్పీ ప్రత్యేక అభినందనలు తెలిపారు.

ఏషియన్ పెయింట్స్ 'వేర్ ది హార్ట్ ఈజ్'లో సినీ నటి రకుల్ ప్రీత్ సింగ్, జాకీ భగ్నానీ కలల ఇల్లు

విశాలాంధ్ర- తిరుపతి : బాలీవుడ్, సౌత్ ఇండియన్ ఫిల్మ్ స్టార్ రకుల్ ప్రీత్ సింగ్, ఆమె భర్త, నటుడు, నిర్మాత జాకీ భగ్నానీతో కలిసి ఇటీవల ఏషియన్ పెయింట్స్ 'వేర్ ది హార్ట్ ఈజ్' తాజా ఎపిసోడ్‌లో అందంగా డిజైన్ చేసిన తమ ఇంటిని ఆవిష్కరించిన్నట్లు ఒక ప్రకటనలో తెలిపారు. గోధుమ రంగు టోన్తో డిజైన్ చేసిన ఈ ప్రత్యేక టూర్‌లో రకుల్, జాకీ తమ ప్రేమ, శాంతి, వ్యక్తిగత శైలిని ప్రతిబింబించే విధంగా నిర్మించామన్నారు. ఈ సందర్భంగా వీరు తమ ఆలోచనలను పంచుకున్నారన్నారు. రకుల్, జాకీ ఇద్దరూ తమ ఇంటి రూపకల్పన వారి వ్యక్తిత్వాలను ప్రతిబింబించేలా ఉందన్నారు. రకుల్, జాకీల ఇల్లు ఒక ఇంటిని అందంగా ఎలా రూపుదిద్దవచ్చో తెలియజేస్తుందన్నారు . ఆమె స్టైల్ గైడ్‌ను చూడండి, ప్రేరణ పొందాలన్నారు. ఏషియన్ పెయింట్స్ బ్యూటిఫుల్ హెూమ్స్ మీకు సరైన భాగస్వామి. మరింత సమాచారం కోసం.. beautifulhomes. ထఎసరికొత్త డిజైన్లు అన్వేషించాలన్నారు.

డైరెక్టర్ గా ప్రమాణ స్వీకారం - పలువురు హర్షం

విశాలాంధ్ర - తిరుచానూరు: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర వన్నికుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ గా చంద్రగిరి నియోజకవర్గ బిసి సెల్ అధ్యక్షులు, తిరుచానూరు 7వ వార్డు మెంబర్ పి. మునిరత్నం రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సిఆర్ రాజన్ అధ్యక్షన ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర డైరెక్టర్ లుచే చైర్మన్ ప్రమాణ స్వీకారం చేయించారు. రాష్ట్ర వన్నెకుల క్షత్రియ కార్పొరేషన్ డైరెక్టర్ గా మునిరత్నం రెడ్డి ప్రమాణ స్వీకారం అనంతరం పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు హర్షం వ్యక్తం చేశారు. కష్టానికి దక్కిన ఫలితంగా పలువురు నాయకులు అభినందిచారు. తన పై నమ్మకం తో రాష్ట్ర డైరెక్టర్ గా ఎన్నిక కావడంలో ప్రధాన పాత్ర పోషించిన చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నానికి, రాష్ట్ర చైర్మన్ సి ఆర్ రాజన్ కి అన్నివేళలా కృతజ్ఞతగా ఉంటానని చెప్పారు. తన శ్రేయోభిల్లాలకూ, కూటమి నాయకులకు, కార్యకర్తలకు మునిరత్నం రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

పైనేని మునెమ్మ స్మారక కథల పోటీ

విశాలాంధ్ర-పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో పైనేని మునెమ్మ స్మారక పురస్కారాలు కొరకు తెలుగు కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి. తులసినాథం నాయుడు, పుష్ప ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ సమస్యలు, సామాజిక సమస్యలను ఇతివృత్తంగా చేసుకొని రాసిన కథలను ఫిబ్రవరి 20 వ తేదీలోపు వి. తులసినాథం నాయుడు,కళామందిరం, సాయిగార్డెన్ సిటీ, గంగవరం, పలమనేరు, చిత్తూరుజిల్లా చిరునామాకు పంపాలన్నారు. మొదటి బహుమతి 5వేల రూపాయలు,రెండవ బహుమతి 3 వేల రూపాయలు, మూడవ బహుమతి రెండు వేల రూపాయలు 5 మందికి వేయి రూపాయలు చొప్పున ప్రోత్సాహక బహుమతులు అందించడంతో బాటు జ్ఞాపికలు, ప్రశంసాపత్రం తోసత్కరిస్తామన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా మానవహారం

విశాలాంధ్ర - రామకుప్పం : జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని మండల కేంద్రమ్కెన మేజర్ గ్రామ పంచాయతీ పోలీసు స్టేషన్ సర్కిల్ ఆవరణలో శనివారం విధ్యార్ధుల చే తహసీల్దార్ బాబు మానవహారం ఏర్పాటు చేయించి ఓటు గురించి వివరించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని డాక్టర్ అంబేద్కర్ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరికీ ఓటు హక్కు కల్పించడం జరిగిందని ఓటర్ల కు అవగాహన కల్పించారు అనంతరం ఓటు తమ నిర్ణయాన్ని వ్యక్త పరిచే బలమైన సాధనమని పేర్కొన్నారు అదేవిధంగా 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటరు గా నమోద చేసుకోవాలని సూచించారు కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది విధ్యార్ధులు ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

తుపాకీ చూపి చంపుతానని బెదిరింపు

పోలీసులకు ఫిర్యాదు చేసిన బాధితుడు

విశాలాంధ్ర - పుత్తూరు :పుత్తూరు: తుపాకీ గురి పెట్టీ చంపుతానంటూ మునిరాజ అనే ఆర్ఎంపీ డాక్టర్ బెదిరించాడని తిమ్మాపురం గ్రామానికి చెందిన పెనుమూరు రాజా శనివారం పోలీసులకు పిర్యాదు చేశాడు. బాదితుడు రాజా పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు వివరాలు.. స్థానిక సెంగుథర్ వీధిలో షణ్ముగా హాస్పిటల్ నడుపుతున్న ఇ.మునిరాజా ఆలియాస్ చిన్నా అనే ఆర్ఎంపీ డాక్టర్ ఈనెల 23వ తేదీ రాత్రి 8 గంటల సమయంలో తనకు ఫోన్ చేసి పున్నమి హెూటల్ వద్దకు రమ్మని పిలిచాడు. అక్కడకు వెళ్లిన తనకు డాక్టర్ మునిరాజా తన వద్ద ఉన్న తుపాకీని చూపుతూ కాల్చి చంపేస్తాన్రా ఏమనుకొంటున్రా నువ్వు నీ యబ్బా అంటూ దుర్భాషాలాడాడు. ఇదేమైనా డూప్లికేట్ అనుకొం టున్నావా? ఎత్తి చూడు దీని వెయిట్ తెలుస్తుందంటూ బెదిరించాడు. దీంతో నేనేమి చేయలేదంటూ అక్కడి నుంచి ఎలాగో తప్పించుకొని గ్రామానికి చేరి జరిగిన విషయం తల్లిదండ్రులకు చెప్పడం జరిగింది. ఈ విషయం గ్రామస్తులందరికి చెప్పి శనివారం పోలీసులకు ఫిర్యాదు చేయడం జరిగింది. దీనిపై సీఐ సురేంద్రనాయుడు మాట్లాడుతూ అందిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టామని తెలిపారు.

తిరుపతిలోని శ్రీనివాసం , భూదేవి కాంప్లెక్స్, విష్ణు నివాసాన్ని పరిశీలించిన ఎస్పీ

విశాలాంధ్ర - తిరుపతి : తిరుమలకు వస్తున్న భక్తులను దృష్టి లో పెట్టుకుని ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉండాలని సూచించిన ఎస్పి క్యూ లైన్ లో ఎర్పాట్లు ఎలా ఉన్నయని అధికారులను అడిగి తెలుసుకుని క్యూ లైన్ పై పలు సూచనలు చేసిన ఎస్పీ తిరుపతికి, తిరుమలకు, వస్తున్న భక్తులను అంచనా వేస్తూ... ట్రాఫిక్ డైవర్షన్ చేయాలని ఆదేశాలు ఇచ్చిన ఎస్పీ అంతే కాకుండా భక్తుల ద్విచక్ర వాహనాలు, కార్లు లకు సంబంధించిన పార్కింగ్ ఏర్పాటు చేసే విధానాన్ని పరిశీలించి, పలు సూచనలు చేసిన ఎస్పిఎంతో భక్తి,శ్రద్ధలతో వస్తున్న భక్తులపట్ల సిబ్బంది అమర్యాదుగా ప్రవర్తించవద్దని ఆదేశాలు ఇచ్చిన ఎస్పీ భక్తులు పట్ల సిబ్బంది ప్రవర్తన పోలీసుల పట్ల గౌరవం పెంచే విధంగా ఉండాలన్న ఎస్పీ సూచించారు.ఈ కార్యక్రమంలో కే.రవి మనోహర చారి అదనపు ఎస్పీ లా అండ్ ఆర్డర్, రామకృష్ణ ఆచారి ట్రాఫిక్ డిఎస్పి శ్రీలత మహిళా పీసీలు పాల్గొన్నారు.

మండల విద్యార్థికి జిల్లా స్థాయి చిత్రలేఖనంలో మొదటి బహుమతి

విశాలాంధ్ర-పలమనేరు: నేషనల్ ఓటర్స్ డే పురస్కరించుకొని శనివారం చిత్తూరు జిల్లా నాగయ్య కళాక్షేత్రంలో జిల్లా స్థాయి చిత్రలేఖనం పోటీలు జరిగాయి. ఈ పోటీలలో పలమనేరు మండలానికి చెందిన దొడ్డిపల్లె ఉన్నత పాఠశాలలో చదువుకుంటున్న బి.చరణ్ తేజ్ 8వ తరగతి విద్యార్థికి మొదటి బహుమతి రావడం జరిగింది. మొదటి స్థాయిలో వచ్చిన చరణ్ తేజ్ విద్యార్థికి జాయింట్ కలెక్టర్ విద్యాధరి నుండి షీల్డ్ తో పాటు ప్రశంస పత్రాన్ని అందుకోవడం జరిగింది. ఈ సందర్భంగా పలమనేరు మండల విద్యాశాఖ అధికారులు లీలారాణి, మరియు ఎంఈఓ 2 సి.బాలసుందరం మొదటి బహుమతి పొందిన విద్యార్థి చరణ్ తేజను విజయానికి కారకులైన డ్రాయింగ్ టీచర్ వి.సుధాకర్‌ని ,ప్రధానోపాధ్యాయులు కే ఎన్ నేతాజీ ని ప్రత్యేకంగా అభినందించారు.

శ్రీ శక్తి పీఠంలో నాగసాధువులు

విశాలాంధ్ర - రామచంద్రపురం : మండలంలోని రాయలచెరువు గ్రామ సమీపంలో గల శ్రీ శక్తి పీఠంలో నాగ సాధువులు శనివారం సందర్శించారు. ఇందులో భాగంగానే శ్రీ శక్తి పీఠంలో గల దేవతామూర్తులను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ క్రమంలోనే పీఠం ప్రతినిధులు వారికి స్వాగతం పలికి అమ్మవారి దర్శనం తో పాటు తీర్థప్రసాదాలను అందించారు. అనంతరం కుర్తాళం పీఠాధిపతి సిద్దేశ్వరానంద భారతి మహాస్వామి, శ్రీ శక్తి పీఠం రమ్యానంద భారతి మహాస్వామిని నుంచి ఆశీర్వాదాలు అందుకున్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్ పేరుతో వీధి వ్యాపారుల కడుపులు కొట్టొద్దు

- 2014 వీధి వ్యాపార చట్టాన్ని అమలు పరచండి
- కమిషనర్‌కి సామూహిక విజ్ఞాపన
- వీధి వ్యాపారుల సంఘం (ఏఐటీయూసీ) డిమాండ్

విశాలాంధ్ర-తిరుపతి: స్వచ్ఛ సర్వేక్షన్ పేరుతో వీధి వ్యాపారుల కడుపులు కొట్టొద్దు. 2014 వీధి వ్యాపార చట్టాన్ని అమలుపరిచి వీధి వ్యాపారస్తులను ఆదుకోవాలి అంటూ కమిషనర్‌కి సామూహిక విజ్ఞాపన తెలుపడం కోసం 27వ తేది సోమవారం 'ఛలో తిరుపతి కార్పొరేషన్ ఆఫీస్' అంటూ వీధి వ్యాపారుల సంఘం (ఏఐటీయూసీ) పిలుపునివ్వడం జరిగింది. ఈ కార్యక్రమానికి సంబంధించి శనివారం ఉదయం 10 గంటలకు శ్రీనివాస కళ్యాణ మండపాల వద్ద కరపత్రాలను విడుదల చేయడం జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు ఎన్ చంద్రశేఖర్ రెడ్డి, వీధి వ్యాపారుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్ శివకుమార్ పాల్గొన్నారు. అనంతరం వారు మాట్లాడుతూ అసంఘటితంగా వున్న వీధి వ్యాపారులను గుర్తించి వారికి గుర్తింపు కార్డులు, వ్యాపార లైసెన్సు అందించడంతో పాటు వారికి మౌలిక సదుపాయాలు అందించాలని భారత అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు ఆజ్ఞాపించిందనీ, కేంద్ర ప్రభుత్వం వీధి వ్యాపరస్తుల జీవనోపాధి, రక్షణ క్రమబద్ధీకరణ చట్టము 2014లో జారీచేయడం జరిగిందని తెలియజేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత నగరంలో పలు ప్రాంతాలను గుర్తించి, అక్కడ గతంలో వ్యాపారాలు చేస్తున్న వారందరినీ ఖాళీ చేయించాలని, అదే స్థలాలలో మా పార్టీకి సంబంధించిన నాయకులు మాత్రమే వ్యాపారాలు కొనసాగించాలని కార్పొరేషన్ కమిషనర్‌పై ఒత్తిడి తెస్తున్నట్లు జనం మాట్లాడుకుంటున్నారని అన్నారు. రాజకీయ నాయకుల ఒత్తిళ్లకు తల వొగ్గ కుండా చట్టాన్ని గౌరవిస్తూ వీధి వ్యాపారులకు న్యాయం చేసే పద్ధతిలో కమిషనర్ ఉండాలని విజ్ఞప్తి చేయబోతున్నట్లు వారు తెలిపారువీధి విక్రయదారుల చట్టం - 2014 ప్రకారం వీధి వ్యాపారస్తులను గుర్తించాలని, సహజ మార్కెట్ల గుర్తింపు, నిర్వహణ చేపట్టాలని, నామమాత్రపు రుసుముతో గుర్తింపు కార్డు, వ్యాపార లైసెన్స్ మంజూరు చేయాలని, టౌన్ వెండింగ్ కమిటీని ఏర్పాటు చేసి ప్రతి నెల సమావేశాలు నిర్వహించాలని, పట్టణానికి సంబంధించిన వీధి వ్యాపార ప్రణాళిక తయారు చేసి క్రమబద్ధీకరణ, మార్కెట్ల ఏర్పాట్లు. అందులో వీధి వ్యాపారులకు స్థలం కేటాయించాలని, వీధి వ్యాపారులకు రుణ సౌకర్యం, బీమా సౌకర్యం, శిక్షణ, ఇతర సామాజిక సంక్షేమ కార్యక్రమాలను ప్రభుత్వ సహకారంతో అందించాలని, వీధి వ్యాపారుల వద్ద గేట్ పేరుతో డబ్బులు వసూలు చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని, వీధి వ్యాపారస్థులకు మున్సిపల్, పోలీసు యంత్రాంగం నుండి రక్షణ కల్పించాల కోరారు. అలాగే ఏఐటీయూసీ తిరుపతి నగర ప్రధాన కార్యదర్శి ఎన్‌డి రవి వీధి వర్తక వ్యాపారుల సంఘం నగర కార్యదర్శి శ్రీనివాసులు మాట్లాడుతూ తిరుపతి కార్పొరేషన్ పరిధిలో కూటమి నాయకుల దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని వీధి వ్యాపారస్తులపై.. మీరు తిరుపతి నగరంలో వ్యాపారం చేసుకోవాలంటే మాకు డబ్బులు ఇవ్వాలన్న దందా కార్యక్రమాలు అక్కడక్కడ ప్రారంభమవుతున్నాయని వీటిని ఆదిలోనే అంతం చేయవలసిన బాధ్యత మున్సిపల్ కమిషనర్ పైన ఉంది అని అలాగే చోటామోటా నాయకుల దందాలపై స్థానిక శాసనసభ్యులు తెలుగుదేశం బిజెపి జనసేన పార్టీ ప్రథమ నాయకులు కట్టడి చేయాలని లేని పక్షంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీకి పట్టిన గతి కూటమి ప్రభుత్వానికి కూడా పడుతుందని దానిని చూస్తూ ఎర్రజెండా ఏఐటియుసి చూస్తూ ఊరుకోదు అని వారు అన్నారువీధి వ్యాపారుల చట్టం అమలుకై జరిగే కమిషనర్‌కి సామూహిక విజ్ఞాపన కార్యక్రమంలో వీధి విక్రయదారులందరూ తప్పనిసరిగా భాగస్వామ్యం కావలసిందిగా ఈ సందర్భంగా విక్రయదారులకు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో బాలాజీ, శ్రీనివాసులు, విజయ్, శేఖర్, భాష, సంజీవయ్య, నాగరాజు, శంకర, రమణమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు విద్యా సామాగ్రి పంపిణీ

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు పట్టణంలోని రామనగర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు పలువురికి స్థానిక బిలీవ్ ఎఫెక్ట్ సర్వీస్ ట్రస్ట్ ఆధ్వర్యంలో విద్యా సామాగ్రి పంపిణీ చేశారు. శనివారం పాఠశాలలో జరిగిన ఒక కార్యక్రమంలో బిలీవ్ ఎఫెక్ట్ సర్వీస్ ట్రస్ట్ వ్యవస్థాపకులు శరవణ ఆధ్వర్యంలో ఎస్ఐ రామస్వామి, ఎంఈఓ రవి విద్యా సామాగ్రిని విద్యార్థులకు పంపిణీ చేయడం జరిగింది. వాటర్ బాటిల్స్, నోటు పుస్తకాలు, పలకలు, పెన్నులు, స్కేల్స్, రబ్బరు తదితర విద్యాసామగ్రిని 50 మంది పిల్లలకు అందించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రామస్వామి మాట్లాడుతూ పిల్లల్లో విద్యాసామర్థ్యాలు పెరిగేలా చూడాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ప్రాథమిక దశలో పాఠ్యపుస్తకాలు సంబంధించి పిల్లలకు సులువైన పద్ధతిలో బోధించాలన్నారు. ప్రతి విద్యార్థికి ప్రాథమిక స్థాయి పునాది వంటిది అన్నారు. ప్రాథమిక విద్యా దశ నుంచే పిల్లల్లో క్రమశిక్షణ ఉండేలా చొరవ చూపాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉన్నట్లు ఆయన గుర్తు చేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం గీత, ఉపాధ్యాయులు గురునాథం, బిలీవ్ ఎఫెక్ట్ సర్వీస్ ట్రస్ట్ ట్రెజరర్ కృష్ణవేణి, సభ్యులు కార్తీక్, శశికళ, రంజిత్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనవరి 28న ఉద్యోగమేళ

విశాలాంధ్ర-సత్యవేడు: సత్యవేడు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జనవరి 28వ తేదీన ఉద్యోగమేళ నిర్వహిస్తున్నట్లు స్థానిక డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుజాత పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎంప్లాయిమెంట్ ఎక్స్ఛేంజ్, సీడాప్, డీఆర్డీఏ శాఖ అధికారుల ఉద్యోగమేల జరుగుతుందన్నారు. శ్రీసిటీకి చెందిన నాలుగు బహుళ జాతీయ కంపెనీలకు సంబంధించిన ఉద్యోగాలకు ఇంటర్వ్యూ నిర్వహిస్తారన్నారు. ఇందుకు సంబంధించి వీల్స్ ఇండియా, బ్లూస్టార్, ముత్తూట్, ఏరియాస్ అగ్రో కంపెనీ ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని ఆమె పేర్కొన్నారు. పదవ తరగతి, ఇంటర్మీడియట్, ఐటిఐ డిప్లమా, బీటెక్ లేదా ఏదైనా డిగ్రీలో ఉత్తీర్ణత అయిన యువతీ యువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలకు హాజరయ్యే యువతీ యువకులు ఆధార్ కార్డు జిరాక్స్ విద్యార్హత సంబంధించిన సర్టిఫికెట్స్ జిరాక్స్ బయోడేటా ఫామ్తో జాబ్ మేళాకు హాజరు కావాల్సి ఉందన్నారు. అలాగే ఇంటర్వ్యూలకు హాజరయ్యే అభ్యర్థులు https://shorturl.at/OQGZI రిజిస్ట్రేషన్ లింక్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని ఆమె కోరారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రాంగణంలో మంగళవారం ఉదయం 9 గంటల నుంచి ఉద్యోగమేల ఇంటర్వ్యూలు ప్రారంభం అవుతుందన్నారు. మరిన్ని వివరములకు 9440374535, 9491458910 మొబైల్ నెంబర్లను సంప్రదించాలని ఆమె వివరించారు. ఈ సదవకాశాన్ని నిరుద్యోగులను యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలన్నారు.

ఎస్ఎఫ్ఐ మహిళా అధ్యక్షురాలుగా ప్రవల్లిక

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: భారత విద్యార్థి సమాఖ్య శ్రీకాళహస్తి పట్టణ మహిళా అధ్యక్షురాలుగా దాసరి ప్రవల్లిక ఎన్నిక య్యారు. శ్రీకాళహస్తి పట్టణంలోని పుచ్చలపల్లి సుందరయ్య భవన్‌లో శనివారం ఎస్ఎఫ్ఐ పట్టణ మహాసభ జరిగింది. ఈ సందర్భంగా దాసరి ప్రవల్లికను పట్టణ అధ్యక్షురాలుగా ఏకగ్రీవంగా ఎన్నుకుంటూ తీర్మానించారు. విద్యార్థులు, విద్యారంగం ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికై తన వంతు శక్తివంచన లేకుండా కృషి చేస్తానని దాసరి ప్రవల్లిక ఈ సందర్భంగా తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ పట్టణ అధ్యక్షుడు చట్టు గురవయ్య, డేవిడ్, మునిలక్ష్మి, రాధమ్మ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఓటుతోనే మంచి ప్రజాస్వామ్యం: మిద్దెల హరి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఓటుతోనే మంచి ప్రజాస్వామ్యం ఏర్పడుతుందని స్విమ్స్ కళాశాల అధినేత మిద్దెల హరి అన్నారు. శ్రీకాళహస్తి మండలం కాపుగున్నేరి వద్ద గల స్విమ్స్ కళాశాలలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మిద్దెల హరి ముఖ్య అతిథిగాహాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... భారతప్రజాస్వామ్యం ప్రపంచంలోనే అతి పెద్దదన్నారు. భారత ఎన్నికల సంఘం 1950 నుంచి సేవలు అందిస్తోందన్నారు. ప్రజాస్వామ్యాన్ని మరింత బలపరిచే క్రమంలో ప్రజలకు ఓటు ప్రాముఖ్యత ప్రాధాన్యత అవగాహన పెంచటకై 2011వ సంవత్సరము నుంచి భారత జాతీయ ఓటర్ల దినోత్సవం నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరూ విధిగా ఓటును నమోదు చేసుకోవాలన్నారు. కుల, మత, ప్రాంత, భాష, ఆర్థిక ప్రలోభాలకు లోను కాకుండా ప్రతి ఒక్కరూ ఓటు హక్కును విధిగా వినియోగించుకుని భారతదేశ అభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఆయన కోరుకున్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకుని విద్యార్థులకు ఓటు ప్రాముఖ్యతపై వక్తృత్వ పోటీ నిర్వహించి బహుమతులు అందించారు. అనంతరం జాతీయగీతంతో ఈ కార్యక్రమం ముగించారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ ఎ. శ్రీకుమార్, ఎంసీఏ విభాగాధిపతి సునీల్ కుమార్, ఏవో సౌందర్య రాజ, అధ్యాపకులు ఈశ్వరయ్య, ఎ.రోజా, ఏ.సాయికుమారి, బోధన, బోధనేతర సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-పుంగనూరు: జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా తాసిల్దార్ రాము మున్సిపల్ కమిషనర్ మధుసూదన్ రెడ్డి లీనార్డ్ మున్సిపల్ హైస్కూల్ విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించడం జరిగింది. ఈ ర్యాలీలో 18 ఏళ్ల నిండిన ప్రతి ఒక్కరు ఓటర్ నమోదు చేసుకోవాలని నినాదాలు చేయడం జరిగింది ఈ సందర్భంగా తాసిల్దార్ రాము మాట్లాడుతూ ఓటు హక్కుతోనే దేశ రాష్ట్ర సమగ్ర అభివృద్ధిని సాధించగలమన్నారు అందువలన ప్రతి ఒక్కరు ఓటరు నమోదుపై అవగాహన కలిగి ఉండాలని ఈ ర్యాలీని నిర్వహించామన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు సివిరెడ్డి దేశాధి ప్రకాష్ రామకృష్ణంరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో సీసీ కెమెరాల ఏర్పాటు

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు డీయస్పీ నరసింహామూర్తి శనివారం తెలిపారు. ఆర్టీసీ బస్టాండు పరిసరాల్లో గల ప్రైవేటు దుకాణాల యజమానులతో మాట్లాడి... రోడ్డు కనబడే విధంగా సీసీ కెమెరాల దిశ మార్చామన్నారు. ఇలా చేయడం వలన బస్టాండు పరిసరాల్లో ఏం జరుగుతుందో తెలుసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమంలో ఒకటవ పట్టణ సీఐ గోపి, పోలీసులు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-తొట్టంబేడు: తొట్టంబేడు డిప్యూటీ తహసీల్దారు జగన్మోహన్ ఆధ్వర్యంలో శనివారం 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తొట్టంబేడు తహసీల్దారు కార్యాలయ ఆవరణలో ఈ వేడుకలు చేశారు. రెవిన్యూ ఉద్యోగులు అందరూ ఓటు హక్కు గురించి ప్రతిన చేశారు. ఈ సందర్భంగా డిప్యూటీ తహసీల్దారు జగన్మోహన్ మాట్లాడుతూ... ఓటు ప్రతి ఒక్కరికీ వజ్రాయుధం అని చెప్పారు. నోటుకు ఓటును అమ్ముకోవద్దని పిలుపునిచ్చారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటు ప్రతి ఒక్కరికీ ఎంతో అవసరం అని తెలిపారు. అనంతరం సీనియర్ ఓటర్లను దుశ్శాలువ, పూలమాలతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో సర్వేయరు హరినాథ్, ఎన్నికల కంప్యూటర్ ఆపరేటర్ సురేష్, రెవిన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డిజిటల్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకోండి

విశాలాంధ్ర-కార్వేటినగరం: జాతీయ విద్యా విధానం 2020 అనుగుణంగా ఉపాధ్యాయులు డిజిటల్ వనరులను సమర్థవంతంగా వినియోగించుకొని విద్యార్థుల సర్వతోముఖాభివృద్ధికి కృషి చేయాలని జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్) ప్రిన్సిపాల్ డాక్టర్ వి.శేఖర్ అన్నారు. శనివారం డైట్ ఆడిటోరియంలో తరగతిగది బోధనలో డిజిటల్ వనరుల వినియోగం అనే అంశంపై ఉమ్మడి చిత్తూరు జిల్లా ఎస్జిటీ, స్కూల్అసిస్టెంట్లకు ఒక్క రోజు శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ సాంకేతిక అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న ప్రస్తుత పరిస్థితులలో కృత్రిమ మేధ వంటి నూతన సాంకేతికాలను ఉపాధ్యాయులు అందిపుచ్చుకుని తమ తరగతి గది బోధనను మెరుగు పరుచుకోవాలని సూచించారు. శిక్షణా సంచాలకులు అలాగే డైట్ అధ్యాపకులు బి.చెంగల్ రాజు మాట్లాడుతూ కృతిమ మేధ అంశంపై ఉపాధ్యాయులకు ఇలాంటి శిక్షణా కార్యక్రమం గతంలో ఎప్పుడూ నిర్వహించ లేదని శిక్షణా కార్యక్రమాన్ని ఉపాధ్యాయులు సద్వియోగం చేసుకోని మరింతగా తమ బోధనను మెరుగుపరుచుకుని విద్యార్థులకు ఆశక్తి దాయకంగా బోధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రీసోర్సు పర్సన్లు నీలకంఠయ్య, మనోహర్, కల్పన, కశిరేఖ, వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, నానిచింగ్ సిబ్బంది, ఉమ్మడి చిత్తూరు జిల్లా ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో అధ్యయనోత్సవాలు

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో జనవరి 28 నుండి ఫిబ్రవరి 20వ తేదీ వరకు అధ్యయనోత్సవాలు జరుగనున్నాయి. ప్రతి ఏడాదీ ఆలయంలో అధ్యయనోత్సవాల సందర్భంగా దివ్యప్రబంధాన్ని పారాయణం చేయడం ఆనవాయితీగా వస్తోంది. ఇందులో భాగంగా ప్రతిరోజూ రాత్రి 7.15 నుంచి 8.15 గంటల వరకు ఆలయంలోని కల్యాణమండపంలో శ్రీదేవి, భూదేవి సమేత శ్రీగోవిందరాజస్వామి వారిని, సేనాధిపతివారిని, ఆళ్వార్లను వేంచేపు చేస్తారు. వారి సమక్షంలో దివ్యప్రబంధాన్ని పారాయణం చేస్తారు. అధ్యయనోత్సవాల్లో భాగంగా ఫిబ్రవరి 7న చిన్నశాత్తుమొర, ఫిబ్రవరి 13న ప్రణయ కలహోత్సవం, ఫిబ్రవరి 17న పెద్దశాత్తుమొర నిర్వహిస్తారు. ఈ ఉత్సవాలను ఫిబ్రవరి 20వ తేదీ వరకు నిర్వహించనున్నారు.

యాంత్రిక వ్యవసాయంతో కూలీల ఖర్చు తగ్గించోచ్చు

విశాలాంధ్ర-కార్వేటినగరం: యాంత్రిక వ్యవసాయంతో కూలీ ఖర్చును అధిగ మించ వచ్చని మండల వ్యవసాయ అధికారిణి హేమలత అన్నారు. శనివారం మండల పరిధిలోని ఆర్కెవీబీపేట గ్రామానికి చెందిన రైతు శ్రీహరి వ్యవసాయ పొలంలో యంత్రసహాయంతో వేసిన వరి నాట్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఏవో మాట్లాడుతూ యాంత్రిక వవసాయంతో రైతులకు సమయంతో పాటు, ఖర్చు ఎంతో ఆదా అవుతుందని తెలిపారు. కూలీల సమస్యను అధిగ మించడానికి యాంత్రిక వ్యవసాయం అందుబాటులో ఉందని, రైతులు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకుని తక్కువ ఖర్చుతో ఎక్కువ విస్తీర్ణం సాగు చేసుకోవచ్చని తెలిపారు. అదే విధంగా దుక్కి చేయడానికి రోటవెటర్లు, వరి విత్తడానికి డ్రమ్ సీడర్లు కూడా అందుబాటులో ఉందని గుర్తు చేశారు. ఈ క్రమంలో భాగంగా యంత్రం ద్వారా వరి నాట్లు వేయడాన్ని ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో విస్తర్ణాధికారి గాయత్రి, రైతులు పలువురు పాల్గొన్నారు.

భవిష్యత్తులో వ్యవసాయమే ప్రధాన భూమిక

- తల్లిదండ్రులు పిల్లలకూ వ్యవసాయ విధానాలు నేర్పించాలి

- ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి/తిరుపతి రూరల్: "భవిష్యత్తులో వ్యవసాయమే ప్రధాన భూమిక అని, తల్లిదండ్రులు పిల్లలకూ వ్యవసాయ విధానాలు నేర్పించాలని ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి తెలిపారు. శ్రీ వేంకటేశ్వర విశ్వవిద్యాలయం శ్రీనివాస ఆడిటోరియంలో డాక్టర్ పాకనాటి హరికృష్ణ నిర్వహించిన "సుభాష్ పాలేకర్ వ్యవసాయం (క్రిషి)" కార్యాశాలకు దాదాపు వెయ్యి మంది విద్యార్థులు భాగస్వామ్యులైన ఈ కార్యక్రమానికి పద్మశ్రీ సుభాష్ పాలేకర్, శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి, తిరుపతి జిల్లా అటవీ శాఖ అధికారి వివేక్, వర్సిటీ ఉపకులపతి సిహెచ్ అప్పారావు, రిజిస్ట్రార్ ఆచార్య భూపతి నాయుడు, సిడిసి డీన్ ఆచార్య ఎన్ సి రాయుడు, ప్రిన్సిపల్ కేటి రామకృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి మాట్లాడుతూ తల్లిదండ్రులు విద్యతోపాటు వ్యవసాయ విధానాలను పిల్లలకు అందించాలని కోరారు. ఎవరు ఎన్ని చేసినా చివరికి భూమాతనే స్పృశించాల్సిందేనని ఆయన వ్యాఖ్యానించారు. విద్యార్థులు పరాజయం పాలైనప్పుడు కృంగిపోకుండా శ్రమించి విజయం సాధించాలన్నారు. పద్మశ్రీ అవార్డ్ గ్రహీత సుభాష్ పాలేకర్ మాట్లాడుతూ అన్నపూర్ణ దేవి అయిన భూమాతను సంరక్షించుకోవాలని, రసాయనరహిత ఆహారం అందించడమే నా అంతిమ లక్ష్యం అన్నారు. ఈ కార్యక్రమంలో వర్సిటీ కల్చరల్ కోఆర్డినేటర్ డాక్టర్ పత్తిపాటి వివేక్, వోర్డ్ ఆర్గనైజేషన్ ప్రతినిధి డాక్టర్ గంగాధర్, డాక్టర్ వేణు, డాక్టర్ చంద్ర, డాక్టర్ శరత్ బాబు, వర్సిటీ అనుబంధ కళాశాలల, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

27 నుంచి జీ తెలుగులో ఎన్నాళ్లో వేచిన హృదయం

విశాలాంధ్ర-తిరుపతి: జీ తెలుగు మరో కొత్త సీరియల్‌తో ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆసక్తికరమైన కథ, కథనంతో రూపొందుతున్న సరికొత్త సీరియల్ ఎన్నాళ్లో వేచిన హృదయం జనవరి 27న ప్రారంభం కానుందని సంస్థ ప్రతినిధులు తెలిపారు. బాధ్యతలు, బంధాలే ప్రధానంగా సాగే అందమైన ప్రేమకథ ఎన్నాళ్లో వేచిన హృదయం సోమవారం నుంచి శనివారం వరకు మధ్యాహ్నం 2:30 గంటలకు, జీ తెలుగులో ప్రసారమవుతుందాన్నారు. ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ త్రిపుర (తన్వియ) అనే ఒక స్కూల్ టీచర్, వ్యాపారవేత్త అయిన బాలకృష్ణ(చందు గౌడ) మధ్య సాగే కథతో రూపొందుతోందన్నారు. కారు ప్రమాదంతో మానసిక వైకల్యానికి గురైన బాలకృష్ణ ఆరోగ్యం బాగుపడేందుకు అతణ్ని రామాపురం తీసుకొస్తారన్నారు. కుటుంబ బాధ్యతలతో సాగుతున్న త్రిపుర జీవితం బాలతో ఎలా ముడిపడుతుంది? ఇద్దరి జీవితాల్లో వచ్చే సమస్యలేంటి? అనే విషయాలు తెలుసుకోవాలంటే జీ తెలుగులో ప్రసారమయ్యే ఎన్నాళ్లో వేచిన హృదయం సీరియల్ని మిస్ కాకుండా చూసేయాలన్నారు. చందు గౌడ, తన్వియ ప్రధాన పాత్రల్లో నటిస్తుండగా, ముంతాజ్, లక్ష్మణ్, ఉమ, కౌశల్, ప్రసాద్, కరాటే కల్యాణి, విశ్వ ఇతర పాత్రల్లో నటిస్తున్నారు.

సంఘమిత్రలతో ఆత్మీయ సమావేశం

విశాలాంధ్ర-పుంగనూరు: మండలంలోని మండల సమైక్య మహిళ సంఘాల సంఘ మిత్రలతో శనివారం మండల కార్యాలయం నందు ఆత్మీయ సమావేశాన్ని మండల టిడిపి అధ్యక్షుడు మాధవరెడ్డి జనసేన పార్టీ మండల అధ్యక్షులు విరుపాక్షి నియోజకవర్గ టిడిపి మహిళా అధ్యక్షురాలు కవిత ఆధ్వర్యంలో నిర్వహించారు ఈ సందర్భంగా మాధవ రెడ్డి మాట్లాడుతూ మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని లక్ష్యంతో ఆనాడు రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబు నాయుడు డ్వాక్రా మహిళా సంఘాలను తీసుకుని రావడం జరిగిందన్నారు ఆనాడు పదివేల రుణంతో మహిళ గ్రూపులో ఏర్పడితే ఇప్పుడు ఒక గ్రూపుకు 20 లక్షల వరకు రుణం పొందుతున్నారన్నారు. ఈ రుణంతో మహిళలు చిన్న తరహా పరిశ్రమలు ఏర్పాటు చేసుకొని వాటి ద్వారా ఆదాయాన్ని పొందుతూ వారి కుటుంబానికి భరోసాగా నిలవడం జరుగుతున్నది అన్నారు మహిళా గ్రూపుల్లో ఉన్న సభ్యులు వారి వారి పిల్లలను మంచి చదువు చదివించుకునే అవకాశం కూడా ఏర్పడిందన్నారు మహిళలు ప్రభుత్వానికి వారిదిగా ఉండి రాష్ట్ర ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను ప్రజలకు అందించే విధంగా ఉండాలన్నారు తద్వారా ప్రభుత్వానికి మంచి పేరు రావడం జరుగుతున్నది అన్నారు మహిళా సంఘాలంతా బ్యాంకులు ఇచ్చే రుణాలను సద్వినియోగం చేసుకుని తిరిగి చెల్లించే విధంగా ప్రతి ఒక్కరు ఉండాలన్నారు అంతేకాకుండా గ్రూపుల్లో మహిళలు కట్టే డబ్బులో సంఘమిత్రాలు ఎలాంటి అవినీతికి పాల్పడకుండా బ్యాంకులో జమ చేసి మరలా మరలా గ్రూపులకు రుణాలు వచ్చే విధంగా కృషి చేయాలని కోరుతున్నాం అన్నారు ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు చదల వెంకటరెడ్డి కడుపు రమణ రాంబాబు శంకర సుబ్రహ్మణ్యం గంగాధర్ జనసేన నాయకులు బాలాజీ నాయక్ హరి నాయక్ బొట్టు శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

చిరు వ్యాపారిపై హత్యాయత్నం

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: తిరుమలలో చిరువ్యాపారం చేసుకుని జీవిస్తున్న బోయన బాబు పై 24వ తేదీ రాత్రి తిరుపతి సత్యనారాయణపురం సమీపంలో హత్యాయత్నం జరిగింది. గుర్తుతెలియని వ్యక్తులు ఇనుప రాడ్లు మారణాయుధాలతో ఆయనపై దాడి చేశారు. బోయన బాబు తిరుపతి సత్యనారాయణపురం లోని అన్నమయ్య నగర్‌లో నివాసం ఉంటున్నాడు. శుక్రవారం తంబువానుగుంటలోని సిపిఆర్ అపార్ట్మెంట్ సమీపంలో తన స్నేహితులతో మాట్లాడి తన ద్విచక్ర వాహనం వెస్పాపై ఇంటికి వస్తుండగా అన్నమయ్య నగర్ సమీపంలో రాత్రి 9:50 నుంచి 10:10 గంటల మధ్య గుర్తు తెలియని వ్యక్తులు ఇనుప రాడ్లతో బోయిన బాబు తలపై కొట్టారు. అతనిపై మూకుమ్మడిగా దాడి చేశారు. ఈ సమయంలో తనపై జరుగుతున్న దాడిని అడ్డుకోవడానికి బోయన బాబు కుడి చేతిని అడ్డంపెట్టగా వారు కొట్టిన దెబ్బలకు చేతి వేళ్ళు విరిగిపోయాయి. అతని కేకలు వేయడంతో నిందితులు అక్కడి నుంచి పారిపోయారు. దీనికి కారణం తిరుమలలోని టీటీడీ పద్మావతి అతిది గృహంలో అసిస్టెంట్ షరాబుగా పనిచేస్తున్న కొనిశెట్టి రాము అలాగే అతని సోదరుడు తిరుమలలో రాయల సారంగి తిరుపతిలోని గ్రీన్ మెడోరియం హోటల్ నిర్వాహకుడు, తిరుమల వైసీపీ యువజన కాంగ్రెస్ నేత కొనిశెట్టి ప్రవీణ్ కారణమని తెలుస్తోంది. వీరు తమ హోటల్ వ్యాపార అభివృద్ధికి బోయన బాబు మధ్యవర్తిత్వంలో అతని స్నేహితుని వద్ద ఏడాది క్రితం రూ.30 లక్షలు అప్పు తీసుకున్నారు. ఇప్పటివరకు తీసుకున్న డబ్బు ఇవ్వక పోవడంతో 2024 డిసెంబర్ 13వ తేదీ బోయన బాబు వారికి ఫోన్ చేసి తీసుకున్న 30 లక్షల రూపాయలు ఇవ్వాలని అడిగాడు. ఆ సమయంలో కొనిశెట్టి రాము, బోయన బాబును కులం పేరుతో దూషిస్తూ డబ్బులు ఇచ్చేది లేదని ఎక్కువగా మాట్లాడితే అంతం చేస్తామని వార్నింగ్ ఇచ్చాడు. ఆ తరువాత తిరుపతి స్కావెంజర్స్ కాలనీకి చెందిన రౌడీషీటర్ బాలాజీ (బిల్లా)కు డబ్బులు ఇచ్చి బోయన బాబును అంతం చేయడానికి పథకం వేశారు. వీరు బోయన బాబు కదలికలపై నిఘావుంచి రెక్కీ కూడా నిర్వహించారు. ఈ నేపథ్యంలోనే 24వ తేదీ రాత్రి ద్విచక్ర వాహనంపై ఒంటరిగా వెళుతున్న బోయన బాబుపై దాడి చేసి హత్య చేయడానికి ప్రయత్నం చేశారు. ప్రస్తుతం బాధితుడు బోయన బాబు రుయా ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. తలకు తీవ్ర గాయం కావడంతో అతని కంటిచూపు తగ్గిపోయింది. కుడి చెయ్యి కూడా విరగడంతో డాక్టర్లు వైద్యం అందిస్తున్నారు.

ఫిబ్రవరి 4న శ్రీ గోవిందరాజస్వామి వారి ఆలయంలో రథసప్తమి

విశాలాంధ్ర-తిరుపతి: తిరుపతి శ్రీ గోవిందరాజ స్వామి వారి ఆలయంలో ఫిబ్రవరి 4వ తేదీన రథసప్తమి పర్వదినం వైభవంగా జరుగనుంది. ఈ సందర్భంగా స్వామివారు దేవేరులతో కలిసి ఏడు వాహనాలపై ఊరేగి భక్తులను కటాక్షించనున్నారు. తెల్లవారు జామున 3 నుండి 5 గంటల వరకు శ్రీచక్రత్తాళ్వార్‌ను ఊరేగింపుగా శ్రీ కపిలేశ్వరస్వామి వారి ఆలయంలోని ఆళ్వారు తీర్థానికి వేంచేపు చేసి చక్రస్నానం నిర్వహిస్తారు. అనంతరం ఉదయం 5.30 నుండి 7.30 గంటల వరకు సూర్యప్రభ వాహనంతో శ్రీగోవిందరాజస్వామి వారి వాహన సేవలు ప్రారంభమవుతాయి. ఉదయం 8 నుండి 9 గంటల వరకు హంస వాహనం, ఉదయం 9.30 నుండి 10.30 గంటల వరకు హనుమంత వాహనంపై స్వామివారు ఊరేగనున్నారు. ఉదయం 11.30 నుండి మధ్యాహ్నం 12.30 గంటల వరకు పెద్దశేష వాహనం, మధ్యాహ్నం 1 నుండి 2.30 గంటల వరకు ముత్యపు పందిరి వాహనం, మధ్యాహ్నం 3 నుండి 4.30 గంటల వరకు సర్వభూపాల వాహనంపై శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ గోవిందరాజస్వామివారు ఊరేగుతూ భక్తులను అనుగ్రహించనున్నారు. రాత్రి 7 నుండి రాత్రి 8.30 గంటల వరకు గరుడ వాహనాన్ని అధిష్ఠించి శ్రీవారు దర్శనమిస్తారు. రథసప్తమి వేడుకలను అర్ధ బ్రహ్మోత్సవమని, ఒక రోజు బ్రహ్మోత్సవమని కూడా భక్తులు అంటారు.

ఓటు ప్రజాస్వామ్యానికి జీవనాడి: ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ఓటు ప్రజాస్వామ్యానికి జీవనాడి అని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి అన్నారు. 15వ జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా శనివారం శ్రీకాళహస్తిలో భారీ ప్రదర్శన నిర్వహించారు. అనంతరం తహసీల్దారు కార్యాలయంలో ఓటు హక్కు వినియోగంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీవో భానుప్రకాశ్ రెడ్డి మాట్లాడుతూ... అర్హులైన ఓటర్లందరూ ఓటు హక్కు వినియోగించుకున్నపుడే ప్రజాస్వామ్యానికి నిజమైన పండుగ రోజు అన్నారు. ఆ దిశగా ప్రజలను చైతన్య పరచడమే ఓటర్ల దినోత్సవ ముఖ్య ఉద్దేశ్యమని భానుప్రకాశ్ రెడ్డి చెప్పారు. ఓటుతోనే దేశ భవిష్యత్తు నిర్ణయించ బడుతుందన్నారు. ప్రజలు మెచ్చిన మంచి ప్రభుత్వం ఏర్పడాలంటే ప్రతి పౌరుడు ఓటు హక్కు వినియోగించుకోవాలని ఆయన అభిప్రాయపడ్డారు. 18 ఏళ్లు నిండిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు చేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. దేశ భవిష్యత్తుకు యువత వెన్నెముక అన్నారు. అదేవిధంగా యువత వినియోగించుకునే ఓటు హక్కు పై కూడా దేశ భవిత ఆధారపడి ఉందన్నారు. యువత సరైన నాయకులను ఎన్నుకుంటారని... దానివలన ప్రజామోదం పొందిన ప్రభుత్వం వస్తుందన్నారు. తద్వారా భారతదేశం ప్రపంచ దేశాల్లో ముందుకు వెళ్లేందుకు అవకాశం ఉంటుందని భానుప్రకాశ్ రెడ్డి అభిప్రాయ పడ్డారు. ఈ నేపథ్యంలో యువత ప్రతి ఒక్కరూ ఓటు హక్కు పొందాల్సిన అవసరం ఉందన్నారు. ఓటర్ల నమోదు అనేది నిరంతర ప్రక్రియ అని ఆయన చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో కంటే పట్టణ ప్రాంతాల్లో విద్యావంతులైన యువత ఓటరుగా నమోదు కావడంలో... ఓటు హక్కు వినియోగించుకోవడంలో వెనుకబడి ఉన్నారనన్నారు. ఈ నిర్లక్ష్య ధోరణి విడనాడాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో శ్రీకాళహస్తి డీయస్పీ నరసింహమూర్తి, తహసీల్దారు లక్ష్మీనారాయణ, పురపాలక కమిషనరు బీవిస్ గిరికుమార్, మండల విద్యాశాఖాధికారి అంబటి బాలయ్య, 1వ పట్టణ సీఐ డి.గోపి, 2వ పట్టణ సీఐ వెంకటేశులు, పట్టణ ప్రణాళిక అధికారిణి వి.శారద, ఎన్నికల డిప్యూటీ తహసీల్దారు బి.రవిచంద్రబాబు, శివ తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన పథకం నాణ్యతలో రాజీవద్దు

విశాలాంధ్ర-బుచ్చి నాయుడు కండ్రిగ: ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులకు 'డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం' ద్వారా అందిస్తున్న ఆహారం నాణ్యతా ప్రమాణాల విషయంలో ఎక్కడా రాజీ పడవద్దని తహసిల్దార్ ఐ.సుబ్రహ్మణ్యం సూచించారు. మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లో శనివారం తహసిల్దార్ ఐ.సుబ్రమణ్యం మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. విద్యార్థులతో భోజనం రుచి చూశారు. అనంతరం ఆయన వంట నిర్వాహకులతో ఉపాధ్యాయులతో మాట్లాడుతూ డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ పథకం ప్రాముఖ్యతను, పిల్లల ఆహార భద్రత పట్ల తమకు ఉండాల్సిన చిత్తశుద్ధితో పనిచేయాలని కొన్ని సూచనలు చేశారు. ప్రభుత్వం సూచించిన ఆహార మెనూ ప్రకారం విద్యార్థులకి ఆహారం అందుతుందో లేదో ఎప్పటికప్పుడు తనిఖీలు చేపట్టాలని, నాణ్యతా ప్రమాణాలు పాటించని వారిపై కఠినంగా వ్యవహరించి బాధ్యులపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులను మండల విద్యాశాఖ అధికారులను ఆదేశించారు. బియ్యం నాసిరకం అయితే తిరిగి పంపాలని వారికి సూచించారు. రెండవ మండల విద్యాశాఖ అధికారి ఆవల ముని సుబ్రహ్మణ్యం తలారివెట్టు, వేణుగోపాలపురం ప్రాథమిక పాఠశాలలో భోజనం పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మండల మొదటి విద్యాశాఖ అధికారి కె రవీంద్రనాథ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఎస్వీబీసీలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి కల్యాణోత్సవం ప్రత్యక్ష ప్రసారం

విశాలాంధ్ర-చంద్రగిరి: శ్రీనివాసమంగాపురం శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో ప్రతి రోజు నిర్వహించే స్వామివారి కల్యాణాన్ని భక్తుల కోరిక మేరకు నెలలో ఒక రోజు ఎస్వీబీసీలో ప్రత్యక్ష ప్రసారం చేయనుంది. ఇందులో భాగంగా జనవరి 25, ఫిబ్రవరి 1, మార్చి 22, ఏప్రిల్ 19, జూన్ 14, 28, జూలై 19, ఆగస్టు 30, సెప్టెంబరు 13, అక్టోబరు 11, నవంబరు 29, డిసెంబరు 13, 27వ తేదీలలో శ్రీ కల్యాణ వేంకటేశ్వరస్వామివారి నిత్య కల్యాణోత్సవాన్ని ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు ప్రత్యక్ష ప్రసారం చేస్తుంది. సుదూర ప్రాంతాల నుండి శ్రీనివాసమంగాపురం రాలేని భక్తులు ఎస్వీబీసీలో స్వామివారి కల్యాణాన్ని వీక్షించాలని టీటీడీ కోరుతోంది.

అర్హులైన ప్రతి వ్యక్తికి ఓటుహక్కు ఎన్నికల కమిషన్ కర్తవ్యం

ఆర్డీవో రామ్మోహన్

విశాలాంధ్ర-చంద్రగిరి: అర్హులైన ప్రతి వ్యక్తికి ఓటు హక్కు కల్పించడం ఎన్నికల కమిషన్ కర్తవ్యం అని ఆర్డీఓ రామ్మోహన్ అన్నారు. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని ప్రజలకు అవగాహన కల్పిస్తూ శనివారం చంద్రగిరి లో విద్యార్థులతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఇందులో భాగంగా రెవెన్యూ యంత్రాంగంతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు ప్లకార్డులు చేతపట్టుకుని రెవెన్యూ కార్యాలయం నుండి టవర్‌క్లాక్ వద్దకు చేరుకుని మానవహారం నిర్మించారు. ఈ సందర్భంగా ఆడిఓ విద్యార్థులు, అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ 1950 జనవరి 25న ఎన్నికల కమిషన్ ఏర్పాటు చేయబడిందన్నారు. ఇందుకు గుర్తుగా 2011 నుండి జనవరి 25న జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు తెలిపారు. 18 సంవత్సరాలు పూర్తి చేసుకున్న ప్రతి ఒక్కరూ తమ ఓటును నమోదు చేసుకోవాలన్నారు. అదేవిధంగా అర్హత లేనివారి ఓటును తొలగించాలని అన్నారు. తద్వారా మంచి ఓటరు జాబితాను రూపొందించుకుని మనల్ని పరిపాలించే ప్రభుత్వాన్ని ఎన్నుకోవచ్చని అన్నారు. మీ కుటుంబంలో, మీ నివాస ప్రాంతాలలో ఎవరైనా ఓటుహక్కు లేనట్లయితే నమోదు చేసుకునే విధంగా ప్రోత్సహించాలన్నారు. అనంతరం ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలకు చేరుకుని సీనియర్ ఓటర్లను ఘనంగా సన్మానించారు. విద్యార్థులకు ఓటుహక్కుపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శివరామసుబ్బయ్య, ఏఎస్ స్వర్ణలత, సిఐ సుబ్బరామిరెడ్డి, ఎస్సై సుమన్, ప్రధానోపాధ్యాయులు వెంకటరమణ రెడ్డి, విజయ, పిడి సక్కుర్ నిరంజన్ రెడ్డి, రెవెన్యూ ఉద్యోగులు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

సాపాటి ప్రకాష్ బాబుకు గౌరవ డాక్టరేట్

విశాలాంధ్ర-తిరుపతి రూరల్: జర్నలిజం, సామాజిక సేవలో అందించిన విశేష సేవలకు గుర్తింపుగా ప్రముఖ సీనియర్ జర్నలిస్ట్ సాపాటి ప్రకాష్ బాబుకు భారత్ వర్చ్యువల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేసింది. శనివారం కర్ణాటక రాష్ట్రం బెంగళూరులో యూనివర్సిటీ కాన్వకేషన్ జరిగింది. వర్సిటీ చైర్మన్ డాక్టర్ తంగవేలు, డీన్ డాక్టర్ స్వామి చేతుల మీదుగా ఈ గౌరవ డాక్టరేట్ ను ప్రకాష్ బాబు అందుకున్నారు. తిరుపతిలో రెండు దశాబ్దాలుగా జర్నలిజం రంగంలో ప్రకాష్ విశేష సేవలు అందిస్తున్నారు. సమాజాన్ని చైతన్య పరిచేలా తన వార్తా కథనాల ద్వారా కృషి చేశారు. కలియుగ ప్రత్యక్ష దైవం వెంకటేశ్వర స్వామి మాతృమూర్తి ఒకరు వకుళమాత ఆలయ దుస్థితి పైన 'అమ్మకు దుర్గతి' అంటూ రాసిన కథనాలు టీటీడీలో సంచలనంగా మారాయి. తరువాత దాదాపు రూ.15 కోట్లకు పైగా నిధులతో పేరూరు బండ పైన వకుళమాత ఆలయం జీర్ణోద్ధారణ చేయడం గమనార్హం. అలాగే మెడికల్ మాఫియా పై, స్వర్ణముఖి నది ఆక్రమణలపైన, ప్రభుత్వ భూములు కబ్జాలపైన, ప్రతిభావంతులైన క్రీడాకారులను వెలికితీయటంలోనూ ప్రకాష్ బాబు విశేషంగా కృషి చేశారని యూనివర్సిటీ చైర్మన్ డాక్టర్ తంగవేలు కొనియాడారు. ఆంధ్రప్రదేశ్ మీడియా స్పోర్ట్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షునిగా, డెమొక్రటిక్ జర్నలిస్ట్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శిగా ప్రకాష్ పనిచేస్తున్నారు. ప్రతిష్టాత్మక తిరుపతి ప్రెస్ క్లబ్ ఉపాధ్యక్షులుగా జర్నలిస్టులకు సేవలందిస్తున్నారు. ఈ సందర్భంగా గౌరవ డాక్టరేట్ అందుకున్న ప్రకాష్ మాట్లాడుతూ ఈ అవార్డు మెరుగైన సమాజం కోసం పగలనక రాత్రి అనక కష్టపడుతున్న జర్నలిస్టులందరికీ దక్కిన గౌరవంగా భావిస్తున్నామన్నారు. అవార్డు తనపై మరింత బాధ్యత పెంచిందన్నారు. అవార్డు స్ఫూర్తితో రానున్న రోజుల్లో మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు.

జాతీయ ఓటరు దినోత్సవం

విశాలాంధ్ర-చిల్లకూరు: 15వ జాతీయ ఓటరు దినోత్సవం సందర్భంగా ఆదివారం తాహశీల్దారు శ్రీనివాసులు ఆధ్వర్యంలో సీనియర్ ఓటర్లను సన్మానించారు. భారత ఎన్నికల సంఘం ఏర్పాటు చేసి 75, సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భం పురస్కరించుకుని మరియు 2024 సాధారణ ఎన్నికలను విజయవంతంగా నిర్వహించడంలో ఎన్నికల సంఘం పాత్ర గురించి వివరించారు. ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశంలో ప్రజాస్వామ్యం అమలు అవుతున్న పద్ధతి ప్రపంచం మొత్తం ఆసక్తి గా గమనిస్తూ ఉందని గుర్తు చేసారు. రెవిన్యూ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

యువత ఓటు నమోదు చేసుకోవాలి

విశాలాంధ్ర-బుచ్చినాయుడు కండ్రిగ: నేటి యువత ఓటును నమోదు చేసుకొని ఓటర్ జాబితాలో పొందుపరచుకోవాలని తహసిల్దార్ ఐ.సుబ్రహ్మణ్యం పేర్కొన్నారు. మండల కేంద్రంలో తహసిల్దార్ కార్యాలయం నుండి రెవెన్యూ సిబ్బంది శనివారం జాతీయ ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా తహసిల్దార్ మాట్లాడుతూ 2025 సం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఘనంగా నిర్వహిస్తున్నాయి. ప్రతి ఏటా జనవరి 25న భారతదేశం జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటోంది. ఇది 1950లో భారత ఎన్నికల సంఘం (ఇ.సి.ఐ) స్థాపించిన రోజును గుర్తు చేసుకుంటూ కేంద్రం ప్రతి ఏటా వేడుకలు నిర్వహిస్తోంది. ఎన్నికల్లో ఓటర్లను భాగస్వామ్యం చేసేందుకు, ఓటింగ్ ప్రాముఖ్యత తెలియజేసేందుకు ప్రజల్లోకి తీసుకెళ్లడానికి 2011 సంవత్సరం నుంచి మొదలైందన్నారు. దేశ భవిష్యత్తు యువతపై ఆధారపడి ఉన్న నేపథ్యంలో వారిని ఓటింగ్ వైపు పోత్సహించేలా నేడు ర్యాలీ కార్యక్రమం చేస్తున్నామన్నారు. ప్రతి ఏడాది కొత్త థీమ్ తో నిర్వహించే విధంగా ప్రభుత్వ ఏర్పాటు చేస్తూ ఉంటుంది. ఈ ఏడాది కూడా కొత్త నినాదంతో "నథింగ్ లైక్ ఓట్.. ఐ ఓట్ ఫర్ ష్యూర్" (ఓటింగ్ లాంటిది. ఏమీ లేదు, నేను కచ్చితంగా ఓటు వేస్తాను.)థీమ్‌తో నిర్వహిస్తున్నారు. 18 సంవత్సరాల యువకులు ఓటు హక్కు వినియోగించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్, మించల నల్లయ్య, వీఆర్వోలు, భాస్కర్, ఈశ్వరయ్య, బాల మురళి, పోలీస్ సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

454 నేత్రదాతగా సుబ్బరాయులు

విశాలాంధ్ర-సూళ్లూరుపేట: సూళ్లూరుపేటకు చెందిన ఆచార్య భరద్వాజ సేవా సంస్థ వారి ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో భాగంగా, సూళ్లూరుపేట, వట్ర పాళెం వాస్తవ్యులు ఎగుముదురు సుబ్బరాయులు (82 సం) మరణానం తరం వారి కార్నియాలను, వారి కుటుంబ సభ్యుల అంగీకారంతో సేకరించి చెన్నై శంకరనేత్రాలయ వారికి అందజేయడం జరిగింది. వీరు మరణించినా నేత్రదానం ద్వారా ఇద్దరు శరీరాలలో జీవించే ఉంటారు. ఆచార్య భరద్వాజ సేవా సంస్థ ఆధ్వర్యంలో జరుగుతున్న నేత్రదాన మహోద్యమంలో 454వ నేత్రదాతగా నిలిచారు. అని ఆచార్య భరద్వాజ సేవా సంస్థ సభ్యులు ఎం .ఎం .చంద్రబాబు తెలిపారు.

జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయం నందు

అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర -తిరుపతి: అంతర్జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా జిల్లా ఎస్పీ వి హర్షవర్ధన్ రాజు ఐపీఎస్ జిల్లా ప్రధాన పోలీస్ కార్యాలయం నందు కార్యాలయ సిబ్బంది తో ప్రతిజ్ఞ కార్యక్రమం నిర్వహించారు.భారత పౌరులను మేము ప్రజాస్వామ్యం పై విశ్వాసంతో, మన దేశ ప్రజాస్వామ్య సంప్రదాయాలు, స్వేచ్ఛాయుత, నిష్పక్షపాత, ప్రశాంత ఎన్నికల ప్రభావాన్ని నిలబెడతామని, మతం, జాతి, కులం, వర్గం, భాష లేదా ఎటువంటి ఒత్తిళ్లకు ప్రభావితం కాకుండా, ప్రతి ఎన్నికల్లో నిర్భయంగా ఓటు వేస్తామని ఇందుమూలంగా ప్రతిజ్ఞ చేస్తున్నాము. అని ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు జె.వెంకట్రావు పరిపాలన, కే.రవి మనోహరాచారి లా అండ్ ఆర్డర్, ఎస్..బి డి.ఎస్.పి వి గిరిధర, ఎస్ బి సిబ్బంది, డిపిఒ సిబ్బంది, డి.సి.ఆర్.బి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-కార్వేటినగరం: జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శని వారం ప్రభుత్వ డిగ్రీకళాశాలలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ విజయులురెడ్డి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడికి వజ్రాయిధాంలాటిదని, అలాంటి హక్కును భారత రాజ్యాంగం మనకు కల్పించడం యువత అదృష్టంగా భావించాలని చెప్పారు. విద్యార్థులందరూ ఓటర్లుగా నమోదు అయ్యి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పిలుపునిచ్చారు. అనంతరం ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో విద్యార్థులకు వ్యాసరచన పోటీలు, చిత్రలేఖన పోటీలు నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు బహుమతులను అందించారు. అదే విధంగా జిల్లా విద్యాశిక్షణా సంస్థ(డైట్)లో ప్రిన్సిపాల్ డాక్టర్ శేఖర్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. బాలికల ఉన్నత పాఠశాలలో హెచ్ఎం గాయత్రీదేవీ ఆధ్వర్యంలో ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకున్నారు. అనంతరం ఓటర్ నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ ఎస్ ప్రోగ్రాం యూనిట్ అధికారి ధనంజయరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ బాలసుబ్రమణ్యం ఆచారి. అధ్యాపకులు రఘురాం. కార్తీక్, సరిత, జోగి ప్రసాద్, విశ్వనాథరెడ్డి, మండల తహసీల్దార్ నాగరాజు, ఆర్.ఐ కిరణ్, ఉపాధ్యాయులు వేణుగోపాల్ మునిశేఖర్, పలువురు పాల్గొన్నారు.

సచివాలయంలో ఘనంగా జాతీయ ఓటర్ల దినోత్సవం

విశాలాంధ్ర-పెద్దపంజాణి : జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని శనివారం తుర్లపల్లె పంచాయతీ సచివాలయంలో ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వీఆర్వో సుబ్రహ్మణ్యం ఆచారి మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి పౌరుడికి వజ్రాయిధాంలాటిదని, అలాంటి హక్కును భారత రాజ్యాంగం మనకు కల్పించడం యువత అదృష్టంగా భావించాలని చెప్పారు. విద్యార్థులందరూ ఓటర్లుగా నమోదు అయ్యి తమ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని ఆయన అన్నారు. అదే విధంగా సచివాలయ సిబ్బంది మరియు గ్రామ ప్రజల ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం కార్యక్రమాన్ని జరుపుకున్నారు. అనంతరం ఓటర్ నమోదుపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామంలోని ప్రజలు పలువురు పాల్గొన్నారు.

ఓటరు దినోత్సవం సందర్భంగా ఈఎస్ఐలో ప్రతిజ్ఞ

విశాలాంధ్ర -తిరుపతి: ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించు కోవాలి.డాక్టర్. శ్యాంబాబు ప్రతి ఒక్కరూ స్వేచ్ఛగా, ప్రజాస్వామ్యంగా ప్రతి ఒక్క ఎన్నిక లోను ఓటు హక్కు తప్పనిసరిగా వినియోగించు కోవాలని, 18ఏళ్లు పైబడిన ప్రతి ఒక్కరూ ఓటరు గా.. నమోదు చేసుకోవాలని తిరుపతి కార్మిక రాజ్య బీమా ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్. మల్లి. శ్యాంబాబు పేర్కొన్నారు. శుక్రవారం స్థానిక ఆర్. సి. రోడ్ లోని ఈ. ఎస్. ఐ. ఆసుపత్రి లో జాతీయ ఓటరు దినోత్సవం పురస్కరించుకొని ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన డాక్టర్స్, సిబ్బంది తో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమం లో సి. ఎస్. ఆర్. ఎం. ఓ. డాక్టర్. ప్రసాద్, కార్యాలయ అధికారి ఎం. నారాయణప్ప తదితరులు పాల్గొన్నారు.

తుడా టవర్స్ నిర్మాణ పనులు పరిశీలన

విశాలాంధ్ర- తిరుపతి కార్పొరేషన్: తిరుపతి పట్టణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నిర్మిస్తున్న తుడ టవర్స్ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. శనివారం తుడా ఉపాధ్యక్షులు ఎన్.మౌర్య అధికారులతో కలసి పరిశీలించారు. అనంతరం నగరపాలక సంస్థ కార్యాలయంలో టవర్స్ పనుల పురోగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. నిర్మాణ పనుల పురోగతిపై అధికారులు వివరించారు. ఈ సందర్భంగా ఉపాధ్యక్షులు మాట్లాడుతూ తుడ టవర్స్ ప్లాన్ ప్రకారం పనులు చేయాలని అన్నారు. నమూనా గది, ఏర్పాటు చేయనున్న మెటీరియల్ లో ఎటువంటి ఇబ్బందులూ లేకుండా చూడాలని అన్నారు. ఫిబ్రవరి లోపు మోడల్ ప్లాన్, ఎగ్జిబిషన్ స్టాల్ నిర్మాణ పనులు పూర్తి చేస్తే వేలం నిర్వహించేందుకు వీలుంటుందని అన్నారు. ఆదిశగా అధికారులు అందరూ నిత్యం పనుల పర్యవేక్షణ చేయాలని అన్నారు. పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో సెక్రటరీ వెంకట నారాయణ, కృష్ణా రెడ్డి, ఈ.ఈ.రవీంద్ర, నిర్మాణ సంస్థ ప్రతినిధి సుశీల్, తదితరులు పాల్గొన్నారు.

వైస్ ఎంపీపీకి చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి పరామర్శ

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండల పరిషత్ వైస్ ఎంపీపీ విదుదల మాధవ రెడ్డిని మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి శనివారం ఆయన ఇంటికి వెళ్లి పరామర్శించారు.గత రెండు రోజుల క్రితం ద్విచక్రవాహనంపై ప్రయాణిస్తుండగా ప్రమాదం జరగడంతో ఆయన కాళ్లు,చేతులకు రక్త గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న చెవిరెడ్డి కుమారుడు హర్షిత్ రెడ్డి ఇంటికి వెళ్లి ప్రమాదానికి గల కారణాలు తెలుసుకుని రక్త గాయాలు నయమయ్యేంత వరకు కాస్త విశ్రాంతి తీసుకోవాలని సూచించారు. ఆరోగ్యం కుదుటపడి త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. పరామర్శించిన వారిలో హర్షిత్ రెడ్డితో పాటు వైసీపీ నేతలు ఉపేంద్ర రెడ్డి,రవి, గోవర్ధన్ రెడ్డి, ప్రకాష్ లు ఉన్నారు.

పశువైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర -తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం పరిధిలోని పుదిపట్ల గ్రామంలో పశుసంవర్ధక శాఖ తరపున శనివారం నిర్వహించిన పశువైద్య శిబిరానికి పాడిరైతుల నుంచి విశేష స్పందన లభించింది. గ్రామ పంచాయతీ సర్పంచ్ బడి సుధాయాదవ్ పశువైద్య శిబిరాన్ని ప్రారంభించగా పాడిరైతులు తమ జంతువులకు వైద్యం చేయించుకున్నారు. పశు వైద్యశాలలో విధులు నిర్వహించే డాక్టర్ యోగానంద్ వైద్య సిబ్బంది చికిత్స చేశారు. ఈ పశువైద్య శిబిరంలో 914 గొర్రెలు, 236 మేకలు, 83 దూడలకు నట్టల నివారణ మందులు అందించారు. అలాగే 140 పశువులకు డీ వార్మింగ్ మందులను, గర్భకోశ వ్యాధులకు చికిత్స ను అందించి ఉచితంగా మందులను కూడా పంపిణీ చేశారు.

శ్రీధర్ రెడ్డికి జన్మదిన శుభాకాంక్షలు

విశాలాంధ్ర-తిరుపతి రూరల్ : తిరుపతి రూరల్ మండలం తిరుచానూరు మార్కెట్ యార్డు మాజీ ఛైర్మన్, వైసీపీ నేత శ్రీధర్ రెడ్డికి మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి కుమారుడు చెవిరెడ్డి హర్షిత్ రెడ్డి జన్మదిన శు భాకాంక్షలు తెలిపారు. శనివారం ఆయన జన్మదినంను పురస్కరించుకుని శ్రీధర్ రెడ్డి ఇంటికి వెళ్లి శు భాకాంక్షలు తెలిపారు. తిరుచానూరు శ్రీ పద్మావతీ అమ్మవారి ఆశీస్సులు మీపై మెండుగా ఉండాలని, నిండు నూరేళ్ల జీవితం ఆయురారోగ్యాలతో సంతోషంగా గడపాలని ఆకాంక్షిస్తూ శ్రీధర్ రెడ్డిని శాలువతో సత్కరించారు.

జిల్లా స్థాయి క్విజ్ పోటీల్లో స్వాతిక మూడవ స్థానం

విశాలాంధ్ర - సూళ్లూరుపేట : జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మన్నారు పోలూరు పాఠశాలలో చదువుతున్న ఈ .సాత్విక తొమ్మిదో తరగతి విద్యార్థిని 23వ తేదీ జరిగిన జిల్లా స్థాయి జాతీయ ఓటర్ దినోత్సవ సందర్భంగా క్విజ్ పోటీలో పాల్గొని జిల్లా స్థాయిలో మూడవ స్థానాన్ని పొందింది నేడు శ్రీ పద్మావతి ఆడిటోరియం తిరుపతి నందు జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్ చేతిమీదిగా సర్టిఫికెట్ అందుకుంది పాఠశాల ప్రధానోపా ధ్యాయులు సి హెచ్ రాజశేఖర్ రెడ్డి, ఉపాధ్యాయ ఎస్కే అక్బర్ ,ఎస్ చంద్రశేఖర్, కె ఎం ఎస్ సునీల్, ఎన్ అనూష తదితర ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, బోధనేతర సిబ్బంది అందరూ స్వాతిక కు అభినందనలు తెలిపారు.

ఎస్. కె.ఆర్‌లో ఆరోగ్యంపై అవగాహన సదస్సు

విశాలాంధ్ర - గూడూరు :స్థానిక ఎస్.కే.ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ ఆధ్వర్యంలో ప్రముఖ ఆక్యుపంక్చరిస్ట్ కె. జ్యోతిర్మయి వివిధ ఆరోగ్య సమస్యల నివారణపై అవగాహన కల్పించారు. ప్రస్తుత సమాజంలో విపరీతంగా పెరిగిపోతున్న అన్ని రకాల కాలుష్యాలు మరియు మారుతున్న జీవనశైలి మానవుని ఆరోగ్యంపై పడి పెరిగిపోతున్న అనారోగ్య సమస్యల నుండి మనుష్యులను కాపాడటానికి ఆరోగ్య విధానం ఈ సమాజానికి చీకటిలో ఒక చిరు దీపంలా ప్రపంచ మానవాళి జీవితాలలో వెలుగును నింపుతుంది అని, ప్రతిచిన్న అనారోగ్య సమస్యకి కెమికల్ మందులపై ఆధారపడుతున్న తరుణంలో వాటి అవసరం పెద్దగా లేకుండా కొన్ని సమస్యలకి చక్కటి పరిష్కారాలు కనిపెట్టి, అభివృద్ధి, పరిశోధనలు గురించి తెలుసుకోవటం మన తక్షణ కర్తవ్యం కనుక జ్ఞానాన్ని పెంపొందించుకోవాల్సిన సమయం ప్రస్తుతం అత్యవసరమని ప్రపంచ పరిశోధనలు గురించి తెలుసుకొని. ఆరోగ్యాన్ని కాపాడుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కే. శివప్రసాద్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ వై. శ్రీనివాసులు ఉమెన్ ఎంపవర్మెంట్ సెల్ కోఆర్డినేటర్ డాక్టర్ ఝాన్సీ వాణి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ పి. విజయ మహేష్, రెడ్ రిబ్బన్ క్లబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. వీరకుమార్, అధ్యాపకులు శ్రీధర్ శర్మ, లక్ష్మీ, మై మూన్, డాక్టర్ కోటేశ్వరరావు, శైలజ, వాణి, వెంకటేశ్వర్లు, రవి రాజు, లక్ష్మీ హిమబిందు అధ్యాపకేతర సిబ్బంది ,విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలి

విశాలాంధ్ర-కోట: భారత రాజ్యాంగం ప్రతి పౌరుడికి ప్రసాదించిన ఓటు హక్కును సద్వినియోగం చేసుకోవాలని తాహసిల్దార్ జయ జయ రావు పేర్కొన్నారు. కోటలో శనివారం 15వజాతీయ ఓటర్ దినోత్సవ కార్యక్రమం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా అధికారులు, విద్యార్థులు కోట క్రాస్ రోడ్డు వరకు ఓటు హక్కు గురించి వివరిస్తూ ర్యాలీ నిర్వహించారు. మానవహారం ఏర్పాటు చేశారు. అంతకుముందు తహసిల్దార్ కార్యాలయం వద్ద సీనియర్ సిటిజన్ కొండూరు రమణమ్మను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసిల్దార్ అంజుతుల్లాఖాన్, ఆర్.ఐ.మధులత రెవిన్యూ సిబ్బంది, ప్రగతి డిగ్రీ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా డాక్టర్ నిరంజన్ బాబు జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - రామచంద్రాపురం : మండలంలోని వెంకట్రామాపురం లో ఉన్న సెవెన్ హిల్స్ ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ ఫార్మసీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా మెంబర్ డాక్టర్ యం నిరంజన్ బాబు 57వ జన్మదిన వేడుకలు కళాశాల విద్యార్థులు, అధ్యాపకులు, సిబ్బంది కలిసి భారీ కేక్ కట్ చేసి ఘనంగా నిర్వహించారు ముందుగా ప్రాంగణానికి చేరుకున్న ప్రిన్సిపాల్ నిరంజన్ బాబుకు పూలలతో ఆత్మీయ స్వాగతం పలుకుతూ విద్యార్థిని విద్యార్థులు అధ్యాపకులు, సిబ్బంది బాణాసంచా కాల్చి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం విద్యార్థులు వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ అలరించాయి. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ నాకు జన్మనిచ్చిన తల్లి తండ్రుల కు నేను జన్మ జన్మలకు రుణపడి ఉంటాను. విద్యార్థుల సమక్షంలో పుట్టినరోజు వేడుకలు జరుపుకోవడం పూర్వజన్మ సుకృతం వల్ల కలిగింది మీరు కష్టపడి చదివి ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆ భగవంతుని ఆశీస్సులు మెండుగా ఉండాలని తెలిపారు. అనంతరం విద్యార్థులు అధ్యాపకులు సిబ్బంది నిరంజన్ బాబు కు శాలువాలు కప్పి పుష్పగుచ్చాలు అందించి వివిధ రకాల మెమెంటోలు జ్ఞాపికలు అందజేసారు.

చంద్రగిరిలో బంగారు ఆభరణాలు చోరీ

విశాలాంధ్ర - చంద్రగిరి: చంద్రగిరి కొత్తపేట బ్రాహ్మణ వీధిలో శుక్రవారం రాత్రి చోరీ జరిగింది. ఇంటి యజమాని అప్పయ్య శాస్త్రి తన కుటుంబ సభ్యులతో 17వ తారీఖున అన్నవరం దైవ దర్శనానికి వెళ్లారు. దైవ దర్శనానంతరం 25.01.25 వ తేదీ ఉదయం ఇంటికి వచ్చి చూడగా ఇంటి తలుపులు కి వేసిన తాళాలు పగలగొట్టబడి గ్రౌండ్ ఫ్లోర్, మొదటి అంతస్తులోని కబోర్డ్స్ బీరువాలలోని బట్టలన్నీ చిందరవందరగా పడి ఉండినాయి. గ్రౌండ్ ఫ్లోర్ ఇంటి లోపల బీరువా లాకర్లలో ఉంచిన సుమారు 40 గ్రాముల బరువు గల బంగారు ఆభరణాలు దొంగ తనానికి గురైనట్లు అప్పయ్య శాస్త్రి గుర్తించాడు. ఎస్సై రవీంద్ర నాయక్ తన సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించారు. క్లూస్ టీం అప్పయ్య శాస్త్రి గ్రౌండ్ ఫ్లోర్ మొదట అంతస్తును క్షుణ్ణంగా పరిశీలించింది. అప్పయ్య శాస్త్రి పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఉత్తరక్రియల్లో పాల్గొన్న వెందోటి కార్తీక్ రెడ్డి

విశాలాంధ్ర -బాలాయపల్లి : మండలం లోని మన్నూరు గ్రామ వైస్సార్సీపీ నాయుకులు కాటూరు ప్రసాద్ రెడ్డి తండ్రి కాటూరు గోపాల్ రెడ్డి ఉత్తర క్రియల కార్యక్రమంలో శనివారం బాలాయపల్లి మండల వైఎస్ఆర్సిపి అధ్యక్షులు వెందోటి కార్తిక్ రెడ్డి పాల్గొన్నారు. మన్నూరు గ్రామం లో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొని నివాళులు అర్పించారు.అనంతరం కాటూరు ప్రసాద్ రెడ్డి కు, వారి కుటుంబ సభ్యులకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియచేసారు . ఈ కార్యక్రమం లో వైసీపీ నాయకులు గుండుబోయిన గోపాల్ యాదవ్ చేజర్ల.గోపీనాథ్ మండల వైఎస్ఆర్సిపి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

పైనేని మునెమ్మ స్మారక కథల పోటీ

విశాలాంధ్ర-పలమనేరు: తెలుగు సాహిత్య సాంస్కృతిక సమితి ఆధ్వర్యంలో జాతీయ స్థాయిలో పైనేని మునెమ్మ స్మారక పురస్కారాలు కొరకు తెలుగు కథల పోటీలు నిర్వహిస్తున్నట్లు సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు పి. తులసినాథం నాయుడు, పుష్ప ఓ ప్రకటనలో తెలిపారు. కుటుంబ సమస్యలు, సామాజిక సమస్యలను ఇతివృత్తంగా చేసుకొని రాసిన కథలను ఫిబ్రవరి 20 వ తేదీలోపు పి. తులసినాథం నాయుడు,కళామందిరం, సాయిగార్డెన్ సిటీ, గంగవరం, పలమనేరు, చిత్తూరుజిల్లా చిరునామాకు పంపాలన్నారు.

తిరుపతిలో ఘనంగా ప్రారంభమైన విమెన్ ఆర్ట్ షో

విశాలాంధ్ర - తిరుపతి : తిరుపతి చెందిన ఎనిమిది మంది మహిళా చిత్రకారుల బృందం శ్రీ పద్మావతి చిత్రాలయం పేరిట రెండు రోజులపాటు చేపట్టిన విమెన్ ఆర్ట్ షో శనివారం హోటల్ ఉదయ్ ఇంటర్నేషనల్ లో ఘనంగా ప్రారంభమైంది. నగరి ఎమ్మెల్యే గాలి భాను ప్రకాష్, పద్మావతి మహిళ విశ్వవిద్యాలయం మాజీ వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ వి. దుర్గాభవాని, ప్రముఖ రచయిత ఆర్ ఎం ఉమామహేశ్వర రావు, జనసేన తిరుపతి ఇంచార్జి కిరణ్ రాయల్ ముఖ్య అతిథులుగా పాల్గొని జ్యోతి ప్రజ్వలనం చేసి ఆర్ట్ షో ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆధునిక జీవన శైలిలో కూడా మన సంస్కృతిలో భాగమైన చిత్రకళను తర్వాతి తరానికి అందించేందుకు మహిళలు ముందుకు రావడం అభినందనీయమన్నారు. తంజావూరు, నిర్మల్, కలంకారీ, మధుబని, స్టిల్ ఆర్ట్ తదితర చిత్ర కళల్లో ప్రతిభ చాటిన మహిళా చిత్రకారులను ప్రత్యేకంగా ప్రశంసించారు. అనంతరం మహిళా చిత్రకారులు ప్రదర్శించిన వివిధ రకాల పెయింటింగ్స్ పరిశీలించారు. కార్యక్రమంలో ఆర్టిస్టులు కిరణ్ కుమారి, గాయత్రి దేవి, బత్తుల అర్చన, రాగిమాను శ్రీదేవి, లావణ్య, జానకి, ఊర్మిళ, సాయి దివ్య, వేమన విజ్ఞాన కేంద్రం నిర్వాహకులు మల్లారపు నాగార్జున, రచయిత మన్నవ గంగాధరం తదితరులు పాల్గొన్నారు.

దేశభవిష్యత్తును తీర్చిదిద్దడంలో

యువత ఓటింగ్ కీలకం

జాతీయ ఓటర్ల దినోత్సవ వేడుకల్లో ఎస్సై రామస్వామి

విశాలాంధ్ర-సత్యవేడు: దేశభవిష్యత్తు తీర్చిదిద్దడంలో యువత ఓటింగ్ కీలకంగా మారినట్టు సత్యవేడు ఎస్సై రామస్వామి చెప్పారు.శనివారం స్థానిక రెవెన్యూ డిటి వెంకటేశ్వర్ ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎంఈఓ రవి,ఎంఈఓ 2 ఉష,ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్యామూల్ అరవింద్,దాస్ డిగ్రీ కళాశాల డిగ్రీ కరస్పాండెంట్ పరంధాం తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఎస్సై రామస్వామి మాట్లాడుతూ యువతరం ఓటింగ్ ప్రక్రియలో పాల్గొనేల ప్రోత్సహించడం కోసమే ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకుంటున్నట్లు ఆయన గుర్తు చేశారు. ఓటర్ల దినోత్సవం పురస్కరించుకొని సీనియర్ సిటిజన్స్ ఎం ఎం రవి, వెంకటేశ్వర్, శివప్రసాద్, శైలజ, శ్రీనివాసులు తదితరులను అధికారులు సాలువ కప్పి ఘనంగా సన్మానించారు. అంతకుమునువు ప్రభుత్వ డిగ్రీ కళాశాల, దాసు డిగ్రీ కళాశాల విద్యార్థులతో కలసి అధికారులు ఓటు ప్రాధాన్యతపై స్థానిక గాంధీ విగ్రహం నుంచి ఆర్టిసి బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ఆర్ఐ సురేష్, ఆర్ఎస్ డిటి త్యాగరాజ్,వీఆర్వోలు రాఘవయ్య,శేఖర్,రమేష్, చిట్టిబాబు, డేటా ఎంట్రీ ఆపరేటర్లు సుధాకర్,మాధురి, దాసు డిగ్రీ కళాశాల అధ్యాపకులు పలని పలువురు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఆశయాలను గౌరవిద్దాం

-బీజేపీ నేత డాక్టర్ చంద్రప్ప

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఆశయాలను గౌరవిద్దామని బీజేపీ తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప అన్నారు. భారత రాజ్యాంగం ఒక పుస్తకం కాదని... అదొక పవిత్ర గ్రంథం అన్నారు. భారతీయ జనతా పార్టీ శ్రీరామ్ నగర్ కాలనీ శక్తి కేంద్రం 107, 109, 110 పోలింగ్ బూత్ అధ్యక్షులు ప్రియాంక, అరుణ, లత ఆధ్వర్యంలో శనివారం సంవిధాన్ గౌరవ దివస్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అతిథులుగా తిరుపతి జిల్లా మాజీ అధ్యక్షులు డాక్టర్ చంద్రప్ప, రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు కండ్రిగ ఉమ, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు ఉమా సింగ్ హాజరయ్యారు. ముందుగా వార్డు సభ్యులతో కలిసి భారత రాజ్యాంగ నిర్మాణ కర్త డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. భారత రాజ్యాంగం పట్ల అవగాహన కల్పిస్తూ మొదటి పేజీని వార్డు సభ్యులకు చదివి వినిపించారు. అనంతరం డాక్టర్ చంద్రప్ప 75 ఏళ్ల రాజ్యాంగ ఘన చరిత్రను ప్రజలకు వివరించారు. రాజ్యాంగం అంటే ఒక పుస్తకం కాదని... అది మన జీవితానికి దశ, దిశ నిర్దేశించే ఒక గ్రంథంగా భావించాలన్నారు. అంబేద్కర్ మన దేశానికి ఇచ్చిన గొప్ప కానుక ఇది అన్నారు. అనంతరం వార్డు సభ్యులకు స్వీట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో వార్డు ప్రజలు పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ ఓటరు దినోత్సవ వేడుకలు

విశాలాంధ్ర-పుత్తూరు : భారతదేశం ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశమని, ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటు హక్కు ఎంతో కీలకమని డాక్టర్ బి చంద్రమౌళి అన్నారు. జనవరి 25వ తేదీని ప్రతి సంవత్సరం జాతీయ ఓటర్ల దినోత్సవం గా జరుపుకుంటారు ఈ సందర్భంగా ప్రభుత్వ డిగ్రీ కళాశాల పుత్తూరులో శనివారం కళాశాల రాజనీతి శాస్త్ర విభాగం ఆధ్వర్యంలో జాతీయ ఓటర్ల దినోత్సవం జరిగింది.ఈ సభకు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ బి చంద్రమౌళి అధ్యక్షత వహించి మాట్లాడుతూ ఓటు యొక్క విలువను అందరు గుర్తించి సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. తాసిల్దార్ జి.సి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ తుపాకీ బుల్లెట్ కంటే గొప్ప ఆయుధం బ్యాలెట్ అని అన్నారు రాజనీతి శాస్త్ర అధ్యాపకులు అర్జా నాగేశ్వరం రావు విద్యార్థుల చేత ఓటర్ ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ దినోత్సవం సందర్భంగా విద్యార్థినీ విద్యార్థులకు వ్యాసరచన, క్విజ్, పెయింటింగు, గ్రీటింగ్ కార్డు డిజైన్ మొదలైన అంశాలలో పోటీలను నిర్వహించారు. విజేతలకు రిపబ్లిక్ దినోత్సవం రోజున బహుమతులు అందజేస్తారు. అనంతరం కళాశాల విద్యార్థినీ విద్యార్థులు పట్టణంలో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఏ.నాగేశ్వరరావు, టి.నరసిం హులు, ఎన్ఎస్ఎస్ అధికారి కే.శ్రీని వాసులు, డాక్టర్ ఆర్‌బి వాణిశ్రీ, డాక్టర్ మన్యం నరసింహులు, డాక్టర్ పి వెంకటేశన్,డాక్టర్ వి. వాసవి, ఎస్. పద్మావతి డాక్టర్ కే.శ్రీదేవి డాక్టర్ పి వరలక్ష్మి, డాక్టర్ పి.గాయత్రి, డాక్టర్. కోటేశ్వరరావు, డాక్టర్ వసంత్ కుమార్ తదితర అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

విశాలాంధ్ర - పలమనేరు : పట్టణంలోని ప్రముఖ ఆసుపత్రి సాయిరామ్ మల్టి స్పెషాలిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత ఐ క్యాంపు మరియు హెల్త్ క్యాంపు ను స్థానిక ఈద్గా మైదానంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు డాక్టర్ యుగంధర్, డాక్టర్ తరంగిణి తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రిపబ్లిక్ డే పురస్కరించుకొని నియోజకవర్గంలోని హిందూ, ముస్లిం, క్రిస్టియన్ ల ఐక్యత తో ఇండియన్ మెడికల్ అసోసియేషన్, మెడికల్ షాప్ అసోసియేషన్, ల్యాబ్ అసోసియేషన్ల సహాయ సహకారాలతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు జరిగే హెల్త్ క్యాంపు ను ప్రజలందరూ అందరూ వినియోగించు కోవాలని ఓ ప్రకటనలో కోరారు.

పశు వైద్య శిబిరానికి విశేష స్పందన

విశాలాంధ్ర-చౌడేపల్లి: మండలంలోని దుర్గ సముద్రం గ్రామం నందుగ వైద్య శిబిరాన్ని ప్రారంభించారు పశు వైద్య ఆరోగ్య శిబిరాలు ఈనెల 31వ తేదీ వరకు అన్ని పంచాయతీల్లోనూ శిబిరాలు నిర్వహిస్తారని పుంగనూరు అసిస్టెంట్ డైరెక్టర్ మనోహర్ తెలిపారు .మంగళవారం చౌడేపల్లి పశువైద్యాధికారి పవన్ కుమార్ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామపంచాయతీ నుంచి అధిక సంఖ్యలో పశువులను 360శిబిరానికి తరలించారు. ప్రథమ చికిత్సలు గర్భకోశ వ్యాధులను మూడి పరీక్షలు ముదత చర్మవ్యాధి నివారణకై జాగ్రత్తలు రైతులతో సమావేశం ఏర్పాటు చేసి పాడి అభివృద్ధికై తీసుకోవలసిన జాగ్రత్తల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది చారాలజేఈఓ మహమ్మద్ అలీ దుర్గ సముద్రంఏపిహెచ్ నందకుమార్ ఆ మీ ని గుంట ఏ హెచ్ ఏ గోవర్ధన రెడ్డి ప్రసాద్ రాజేష్ రైతులు తదితరులు పాల్గొన్నారు.

ప్రాంతీయ పోటీలో యంబియు విశ్వవిద్యాలయ బృందానికి ప్రథమ బహుమతి

విశాలాంధ్ర-చంద్రగిరి: వి-హబ్, యంబియు బృందం రూపొందించిన వినూత్న కెరీర్ మార్గదర్శక ప్రాజెక్ట్ వాట్స్ నెక్స్అన్వేషణ చిత్తూరు ప్రాంతీయ పోటీలో ప్రథమ బహుమతి గెలుచుకోవడంతో గొప్ప విజయాన్ని సాధించింది. విద్యార్థులలో సృజనాత్మకతను, బీటెక్ విద్యార్థులు మరియు పాఠశాల విద్యార్థుల మధ్య సహకారాన్ని ప్రోత్సహించేందుకు రూపొందించిన ఈ ప్రత్యేక కార్యక్రమానికి చిత్తూరు జిల్లా నలుమూలల నుంచి 130కి పైగా వినూత్న ఆలోచనలు సమర్పితమయ్యాయి. వాట్స్ నెక్స్ బృందం సభ్యులు:మోక్షిత్, 3వ సంవత్సరం ఎస్ఐ మరియు ఎంఎల్ సంతోష్, ఎంబిఏ మొదటి సంవత్సరం దీక్షిత్ మరియు శిరీష్, ఎస్విఐఎస్ పాఠశాల విద్యార్థులు (8వ మరియు 9వ తరగతి) వీరి బృందానికి వి-హబ్ కోఆర్డినేటర్ డాక్టర్ బి. విష్ణు వర్ధన నాయుడు మెంటార్‌గా వ్యవహరించారు. ఈ ప్రాజెక్ట్, 32 ఫైనల్ రౌండ్ లో పోటీపడిన ప్రాజెక్టులో ఒకటిగా ఎంపికై, జనవరి 23 మరియు 24 తేదీల్లో కుప్పంలో ఉన్న అగస్త్య ఇంటర్నేషనల్ ఫౌండేషన్ లో జరిగిన తుది పోటీల్లో విశేషంగా రాణించింది. జడ్జిలను ఆకట్టుకున్న ఈ ప్రాజెక్ట్ బృందానికి రూ.15 వేలు నగదు బహుమతి లభించింది. అదేవిధంగా ఈ బృందం రాష్ట్ర స్థాయి పోటీకి హైదరాబాదులో జరిగే రౌండ్‌కు ఎంపికైంది. రాష్ట్ర స్థాయి విజేతలు జాతీయ స్థాయి పోటీకి బెంగుళూరులో పాల్గొనే అవకాశం పొందుతారు. వాట్స్ నెక్స్ ప్రాజెక్ట్ మరింతమందిని ప్రేరణ నింపుతూ, విద్య మరియు కెరీర్ మార్గదర్శకతలో మైలురాయిగా నిలుస్తోంది.

పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర-కోట: పేదలకు కార్పొరేట్ స్థాయి వైద్యం అందించడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని గూడూరు శాసన సభ్యులు డాక్టర్ పాసిం సునీల్ కుమార్ పేర్కొన్నారు.కోటలోని 30 పడకల సామాజిక ఆరోగ్య కేంద్రంలో 12 లక్షల రూపాయలతో ఏర్పాటు చేసిన ఎక్సరే ప్లాంటును శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేదలు ఎటువంటి అనారోగ్య సమస్యలు తలెత్తిన ప్రభుత్వ వైద్యాలను ఆశ్రయిస్తారని అక్కడవారికి మెరుగైన వైద్యం అందాలనే ఉద్దేశంతో ఎక్స్‌రే ప్లాంట్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వైద్యాధికారి రూప ఇతర వైద్యులు రోగులకు శ్రద్ధగా వైద్యం అందిస్తున్నారని వారిని అభినందించారు. వైద్యశాలకు ఫ్రీజర్ బాక్స్ కావాలని వైద్యాధికారి రూప కోరడంతో తనతండ్రి కీర్తిశేషులు పాశం పెంచలయ్య పేరు మీదుగా ఫ్రీజర్ బాక్స్ అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే వైద్యశాలలో ఎటువంటి పరికరాల అవసరమైన తాను ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నానని తెలిపారు. అనంతరం వైద్యశాల నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. నూతనంగా ఎన్నికైన కమిటీ సభ్యులు దామవరపు బాలసుబ్రమణ్యం, దార ప్రమీల, షేక్ బాబు, వీరికి పాశం సునీల్ కుమార్ అభినందనలు తెలిపారు. అంతకుముందు టిడిపి జిల్లా మైనార్టీ సెల్ అధ్యక్షులు షేక్ జలీల్ అహ్మద్ ఆధ్వర్యంలో ఘన స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో టీడీపీసీనియర్ నాయకులు నల్లపరెడ్డి జగన్మోహన్ రెడ్డి, చిల్లకూరు దశరధ రామిరెడ్డి, పలగాటి భాస్కర్ రెడ్డి, నెల్లూరు మోహన్ రెడ్డి, పొదర్తి కోటేశ్వరరెడ్డి, వాకా విజయభాస్కర్ రెడ్డి, తీగల సురేష్ బాబు, పలగాటి జితేంద్ర రెడ్డి, షేక్ షంషుద్దీన్, దారా సురేష్, మర్రి పోలయ్య, కోకొర్ల మధుయాదవ్, మర్రి అనిల్, శ్రీధర్ రెడ్డి, తిరుమల శెట్టి కోటేశ్వరరావు, షేక్ నౌషాద్, షేక్ నాయబ్ రసూల్, షేక్ మస్తాన్ భాష, రామయ్య, నందమోహన్, సిద్ధపరెడ్డి పోలమ్మ, సుహాసిని, తిరుమూరు మురళి, అనూక్, దామవరపు బాబు, టీడీపీ సోషల్ మీడియా మీజూరు మధుబాబు, రూపేష్, కోటి, శశి, నీలేష్, పవన్, ప్రశాంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

తెలుగుదేశంలోనే మహిళలకు ప్రాధాన్యత

- అన్ని రంగాల్లో మహిళలకు అవకాశం
- ఇంటికో మహిళా పారిశ్రామిక వేత్తగా రాణించాలి
- ఎమ్మెల్యే చేతుల మీదుగా బైరెడ్డిపల్లి మహిళా సమాఖ్య సభ్యులకు రూ.13.92 కోట్ల చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-పలమనేరు: తెలుగుదేశం ప్రభుత్వంలోనే మహిళలకు అన్ని రంగాల్లో ప్రాధాన్యత కల్పించడం జరిగిందని పలమనేరు ఇందులో అమరనాథ్ రెడ్డి పేర్కొన్నారు. బైరెడ్డిపల్లి మండల కేంద్రంలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో జరిగిన మెగా రుణమేళా కార్యక్రమానికి ఆయన శనివారం హాజరయ్యారు. ఈ సందర్భంగా 13.92 కోట్ల మెగా చెక్కును మహిళా సభ్యులకు ఆయన పంపిణి చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.... మహిళలకు విద్య, ఆర్థిక, రాజకీయ పరంగా అవకాశం కల్పించిన ఘనత తెలుగుదేశం ప్రభుత్వానిదే నన్నారు. మహిళల అభివృద్దే సమాజాభివృద్ధి అనే సిద్ధంతంతో మహిళా సంక్షేమానికి ఈ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మహిళలు ఆర్థికంగా సామాజకంగానే గాక పారిశ్రామికంగా ఎదగాలని తెలిపారు. మహిళల కోసం నాడు ఎన్టీఆర్ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలను చేపట్టి వారి అభ్యున్నతికి బీజం వేశారని వివరించారు. తదనంతరం ముఖ్యమంత్రిగా చంద్రబాబు సైతం మహిళల కోసం ఎన్నో సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టి వారి అభివృద్ధికి కృషి చేశారన్నారు. ప్రధానంగా దీపం పథకంతో పాటు డ్వాక్రా గ్రూపులను ఏర్పాటు చేసి మహిళలు స్వశక్తితో రాణించేలా చేసారన్నారు. మహిళలు ఆర్థికంగా రాణించినప్పుడే సమాజం అభివృద్ధి చెందుతుందన్నారు. అందులో భాగంగా మహిళలు పారిశ్రామికంగా ఎదగాలనే ఉద్దేశంతో ప్రభుత్వం అనేక పథకాలను చేపడుతోందని ఇంటికో మహిళా పారిశ్రామికవేత్తగా ఎదగాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. మహిళలు ఆర్థిక శక్తిగా భవిష్యత్తులో ఎదగాలని బ్యాంకర్లు మహిళలకు విరివిగా రుణాలు అందించి వారితో పాటు సహకరించాలని ఆయన కోరారు. అనంతరం మండల అధికారులతో సమీక్ష నిర్వహించారు. చేసిన తప్పులు సరిదిద్దుకోండని లేకుంటే ఇబ్బందులు తప్పవు అని హెచ్చరించారు. అర్హులకే ఇళ్ళు అందాలని సూచించారు. ఎఫ్ఎంబీ ప్రకారమే రీ సర్వే జరగాలన్నారు తాగునీటి సమస్య తలెత్తకూడదని రైతులకు సకాలంలో ట్రాన్స్ ఫార్మర్ లను అందించాలన్నారు. విద్యార్థుల తల్లిదండ్రులు అభిప్రాయాలకు అనుగుణంగా మోడల్ పాఠశాలల ఏర్పాటు జరగాలన్నారు అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కిషోర్ గౌడ, ప్రధాన కార్యదర్శి సుబ్రహ్మణ్యం శెట్టిలతో పాటు జనసేన నాయకులు దిలీప్ కుమార్ లతో పాటు నాయకులు, కార్యకర్తలు మరియు ఎంపీడీవో రాజేంద్ర బాలాజీ, తహసీల్దార్ మాధవ రాజు, డీపీఎంయా

ఖైదీలు చట్టంపై అవగాహనా కలిగివుండాలి

- 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్

విశాలాంధ్ర-శ్రీకాళహస్తి: ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీలు తప్పక చట్టం పై అవగాహనా కలిగివుండాలి 12వ అదనపు జిల్లా జడ్జి శ్రీనివాస్ నాయక్ తెలిపారు. హైకోర్టు ఆదేశాలమేరకు తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి పట్టణంలోని సబ్ జైలును శ్రీకాళహస్తి 12వ అదనపు జిల్లా జడ్ శ్రీనివాస్ నాయక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి శ్రీనివాస్ నాయక్ మాట్లాడుతూ ప్రతి ఒక్క రిమాండ్ ఖైదీలకు తప్పక చట్టం పై అవగాహనా కలిగివుండాలి అన్నారు. అలాగే బెయిల్ గురించి, ఉచిత న్యాయం, న్యాయ చట్టం తదితర చట్టాలపై అవగాహన కల్పించారు. మీ పరిసరప్రాంతాలు పరిశుభ్రంగా ఉండాలని తెలిపారు. మీకు ఏ సమస్యవున్న ఒక అర్జీ రూపంలో ఇచ్చినచో మీ సమస్య పరిష్కరించుటకు ప్రయత్నిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమములో న్యాయవాదులు, పారా లీగల్ వాలంటీరులు, కోర్ట్ సిబ్బంది, సబ్ జైలు సిబంది పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటు హక్కును వినియోగించుకోండి

- 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడు ఓటు హక్కుని వినియోగించుకోవాలి
- జిల్లా ప్రధాన న్యాయమూర్తి

విశాలాంధ్ర-చిత్తూరు: దేశ పౌరులు తమ ఓటు హక్కును పారదర్శకంగా వినియోగించుకోవాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఈ.భీమ్ రావు తెలిపారు. శనివారం చిత్తూరు నాగయ్య కళాక్షేత్రంలో 15వ జాతీయ ఓటర్ల దినోత్సవ కార్యక్రమములో జిల్లా ప్రధాన న్యాయమూర్తితో పాటు జిల్లా జాయింట్ కలెక్టర్ జి.విద్యాధరి, అసిస్టెంట్ కలెక్టర్ హిమ వంశీ, డిఎఫ్ఓ భరణి, డిఆర్ఓ కె.మోహన్ కుమార్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని, ఓటు హక్కు రాజ్యాంగం కల్పించిన హక్కు అన్నారు. ప్రతి ఓటరు తమ విలువైన ఓటును వినియోగించుకొనే సమయంలో సరైన అభ్యర్థిని ఎన్నుకోవడం పైనే దేశ భవిష్యత్తు ఆధారపడి ఉంటుందన్నారు. దేశ భవిష్యత్తుని అభివృద్ధి పథంలో నడిపే నాయకులను ఎన్నుకోవాలన్నారు. జిల్లా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతీ పౌరుడు ఓటు హక్కుని వినియోగించుకోవాలన్నారు. 18 సంవత్సరాలు పూర్తి అయిన ప్రతి యువత బిఎల్ఓ లను సంప్రదించి కచ్చితంగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకోవాలన్నారు. కుల, మత, జాతి, లింగ భేదాలు లేకుండా సమాన హక్కుతో ఓటును వినియోగించుకునే అవకాశం మనదేశంలో ఉందని, ఓటు హక్కు ఉన్న ప్రతి ఒక్కరూ తప్పక ఓటు హక్కును వినియోగించుకోవాలని తెలిపారు.అసిస్టెంట్ కలెక్టర్ మాట్లాడుతూ 15వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని జరుపుకోవడం చాలా సంతోషంగా ఉందని, ఓటు హక్కును ప్రతి ఒక్కరూ వినియోగించుకోవడం చాలా ముఖ్యమని, 18 సంవత్సరాలు నిండినవారు పెదలైనా, ధనికులైనా, చదువుకున్నవారైనా, చదువు లేని వారైనా తమ ఓటు సమాన హక్కుతో వినియోగించుకునే అవకాశం మనదేశంలో ఉంటుందని, ప్రతి ఒక్కరి జీవితంలో ఓటును వినియోగించుకోవడం వారి అదృష్టంగా భావించాలని, ఓటు హక్కు కలిగిన ఇరుగు పొరుగు వారు కూడా తమ ఓటును వినియోగించుకునేలా అవగాహన కల్పించడం బాధ్యతగా భావించాలన్నారు. జిల్లా రెవెన్యూ అధికారి మాట్లాడుతూ భారత ఎన్నికల సంఘం ఏర్పాటై ఇప్పటికి 75 సంవత్సరాలు అయ్యాయని, తొలిసారిగా దేశంలో ఎన్నికలు 1950 జరిగాయని, 2011 సం.లో జాతీయ ఓటర్ల దినోత్సవంను మొదట జరుపుకోవడం జరిగిందన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతీ ఒక్కరికీ రాజ్యాంగం ఓటు హక్కు కల్పించిందని, ఓటర్ గా నమోదైన తరువాత ఓటు హక్కుతో పాటూ బాధ్యతలు కూడా గుర్తుంచుకోవాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి కార్యక్రమానికి హాజరైన ప్రతి ఒక్కరితో ఓటు హక్కు ప్రతిజ్ఞ చేయించారు. జాతీయ ఓటర్ల దినోత్సవం సందర్భంగా నిర్వహించిన పోటీలలో గెలుపొందిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతుల ప్రధానం, యువ ఓటర్లకు ఎపిక్ కార్డుల పంపిణీ, సీనియర్ సిటిజన్ ఓటర్లకు సన్మాన కార్యక్రమం అతిథుల చేతులమీదుగా జరిగింది. ఈ కార్యక్రమంలో ఎలెక్షన్ సెల్ పర్య వేక్షకులు వాసుదేవన్, చిత్తూరు ఆర్డిఓ శ్రీనివాసులు, డిస్ట్రిక్ట్ ఐకాన్ మరియు బాస్కెట్ బాల్ క్రీడా కారుడు కె.నాగార్జున, చిత్తూరు అర్బన్, రూరల్, గుడిపాల తహసీల్దార్లు లోకేశ్వరి, కళావతి, చంద్రశేఖర్ రెడ్డి, చిత్తూరు డివైఈఓ చంద్ర శేఖర్, సీనియర్ సిటిజన్లు, విద్యార్థినీ, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.